ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
అన్నమయ్య
జిల్లా వార్తలు
బుధవారం 2 అక్టోబరు 2024



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

రెండు దశాబ్దాల కాలంలో ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నా.. రాజకీయంగా ఇబ్బందులూ పడ్డా.. అయినా ఆ ఓటమికి నేను కృంగిపోలేదు. నియోజకవర్గంలో దశాబ్దాలుగా మా కుటుంబంతో ఉన్న కార్యకర్తలు, ప్రజలనే నమ్ముకున్నా.. నియోజకవర్గం వదిలి వెళ్లకుండా.. ప్రజలతో సత్సంబంధాలు కొనసాగించా.. దీని ఫలితమే.. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రజలు బ్రహ్మరథం పట్టారు. వైసీపీ తమ కంచుకోట అని చెప్పుకునే రాయచోటిని బద్దలు కొట్టి నన్ను గెలిపించారు. చిన్న వయస్సులోనే నాకు మంత్రి పదవి దక్కడం అదృష్టంగా భావిస్తున్నా.. నాపైన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయను. వారి సహకారంతో ఎక్కువ నిధులు తెచ్చి.. రాయచోటిని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి.. ఇక్కడి ప్రజల రుణం తీర్చుకుంటా.. అని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆయన ఆంధ్రజ్యోతితో ముచ్చటిస్తూ..

ప్రజలనే నమ్ముకున్నా...

- 40 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్న కుటుంబం మాది
- కష్టకాలంలోనూ నమ్ముకున్న వాళ్లను వదలలేదు
- అందుకే వైసీపీ కంచుకోట బద్దలు కొట్టాము
- చిన్న వయస్సులో మంత్రి పదవి దక్కడం అదృష్టం
- సీఎం చంద్రబాబు నమ్మకాన్ని వమ్ము చేయను
- రాయచోటి ప్రజల రుణం తీర్చుకుంటా..
- ఆంధ్రజ్యోతితో రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖల మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): మా కుటుంబం 40 సంవత్సరాలుగా ప్రత్యక్ష రాజకీయాల్లో ఉంది. మా తండ్రి మండిపల్లి నాగిరెడ్డి సమితి ప్రెసిడెంటుగా పనిచేశారు. 1985, 1990లో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసి రాయచోటి ఎమ్మెల్యేగా గెలిచారు. తల్లి సుశీలమ్మ చిన్నమండెం ఎంపీపీగా పనిచేశారు. పెద్దనాన్న కొడుకు మండిపల్లి నారాయణరెడ్డి 1992, 1994 ఎన్నికల్లో రాయచోటి ఎమ్మెల్యేగా గెలిచారు. తర్వాత మా సోదరి శ్రీలత 2004 ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి చెందింది. ప్రత్యేక పరిస్థితుల్లో 2003లో రాజకీయ ప్రవేశం చేశాను. అయితే వయస్సు తక్కువగా ఉండడంతో నాకు టికెట్టు రాలేదు. 2004లో మా సోదరి శ్రీలతారెడ్డికి కాంగ్రెస్ పార్టీ టికెట్టును ఇచ్చింది. ఆ ఎన్నికల్లో ఆమె స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చెందారు. 2009 ఎన్నికల్లోనూ నేను కాంగ్రెస్ పార్టీ టికెట్టును ఆశించాను. 2009లో నియోజకవర్గాల పునర్విభజన జరగడంతో రాయచోటి, లక్కిరెడ్డిపల్లె నియోజకవర్గాలు రెండూ కలిసిపోయాయి. ఆ ఎన్నికల్లో నాకు టికెట్టు దక్కలేదు. అప్పట్లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మాట మేరకు శ్రీకాంత్‌రెడ్డి గెలుపు కోసం కృషి చేశాను. రాజశేఖర్‌రెడ్డి మరణం తర్వాత 2012లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సొంత పార్టీ పెట్టుకుని కాంగ్రెస్ నుంచి బయటకు వెళ్లిపోయారు. 18 మంది రాష్ట్రవ్యాప్తంగా ఎమ్మెల్యే పదవులకు రాజీనామాలు చేశారు. 2012లో జరిగిన ఉప ఎన్నికల్లో అప్పటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నేను కాంగ్రెస్ పార్టీ తరఫున రాయచోటి ఎమ్మెల్యే స్థానానికి పోటీ చేసి ఓడిపోయాను. 2014 సాధారణ ఎన్నికల్లో కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రారంభించిన సమైక్యాంధ్ర పార్టీ తరఫున ఎమ్మెల్యేగా నామినేషన్ వేశా.. అయితే ఎక్కడా ప్రచారం చేయకుండా.. ఇంటికే పరిమితం అయిపోయా. తర్వాత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరాను. 2019లో వైసీపీ టికెట్టును ఆశించాను. టికెట్టు రాలేదు. అయినా జగన్‌రెడ్డి మాట ప్రకారం శ్రీకాంత్‌రెడ్డి గెలుపు కోసం కృషి చేశాను. ముఖ్యమంత్రి అయిన తర్వాత జగన్‌మోహన్‌రెడ్డి వ్యవహార శైలి నచ్చక, ఆయన మాట మీద నమ్మకం లేక వైసీపీ నుంచి బయటకు వచ్చేశా.

చంద్రబాబు పిలిచారు

వైసీపీ నుంచి బయటకు వచ్చిన తర్వాత.. ఏ పార్టీలోనూ లేకుండా ఉండిపోయా.. 2021లో రాయచోటి నియోజకవర్గంలో టీడీపీలో ఉన్న పరిస్థితుల్లో నాకు టికెట్టు ఇస్తానని చంద్రబాబు పిలిపించారు. దీంతో నేను అప్పటి నుంచి టీడీపీలో చేరి క్రియాశీలంగా పని చేశాను. తర్వాత మళ్లీ టికెట్టుకు పోటీ పడడంతో మూడు సంవత్సరాల పాటు టికెట్టు ప్రకటించలేదు. చివరికి ఎన్నికలకు 65 రోజుల ముందు రాయచోటి అసెంబ్లీ అభ్యర్థిగా ప్రకటించారు. దీంతో బాగా కష్టపడ్డాము. ఇక్కడ ఉన్న తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు నా గెలుపు కోసం బాగా కృషి చేశారు. టీడీపీ, బీజేపీ కలయిక నేపథ్యంలో మైనార్టీలు ఎక్కువగా ఉన్న రాయచోటి నియోజకవర్గంలో గెలుపు అసాధ్యం అనే పరిస్థితులు. అయితే బీజేపీ ఎంపీ అభ్యర్థికి నాకంటే 29 వేల ఓట్లు తక్కువగా వచ్చాయి. నియోజకవర్గ ప్రజలు నన్ను ఆదరించారు. 2600 ఓట్లతో గెలిచామంటే.. ప్రజల తీర్పు అమోఘం..

కీలక శాఖలు అప్పగించారు

మూడున్నర సంవత్సరాలు నేను తెలుగుదేశం పార్టీ అనుబంధ సభ్యుడిగా ఉన్న సమయంలో నా పోరాట పటిమ చూసిన చంద్రబాబు, నారా లోకేశ్‌లు నా మీద నమ్మకంతో నాకు మంత్రి పదవి ఇచ్చారు. రాయలసీమలోనే రెడ్డి సామాజికవర్గానికి రెండు మంత్రి పదవులు ఇస్తే అందులో నేను ఒకడిని కావడం అదృష్టం. నా మీద నమ్మకంతో క్యాబినెట్‌లో మంచి ప్రాధాన్యత ఉన్న శాఖలు కేటాయించారు. రవాణా శాఖ ఎంతో కీలకమైంది. మన రాష్ట్రంలో ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం కావడంతో ఆ శాఖ బాధ్యత కూడా నాకే అప్పగించారు. వీటితో పాటు యువజన, క్రీడా శాఖలు కూడా నాకు అప్పగించారు. ఇది చాలా పెద్ద బాధ్యత. ఈ బాధ్యతను సక్రమంగా నిర్వహించేందుకు శ్రమ పడుతున్నా.

కుటుంబం... విద్య

మా తండ్రి నాగిరెడ్డి, తల్లి సుశీలమ్మ.. వాళ్ల నలుగురు సంతానంలో మూడవ వాడిని.. ఇద్దరు అక్కలు ఉన్నారు. పడమటకోన గ్రామం బోరెడ్డిగారిపల్లెలో 1980 మార్చి 19న పుట్టాను. అక్కలు శ్రీలత రెడ్డి, శ్రీవిద్య, తమ్ముడు లక్ష్మీప్రసాద్‌రెడ్డి, పాఠశాల విద్యాభ్యాసం తిరుపతి రాయలసీమలో చదివాను. 1998లో బెంగుళూరులో డెంటల్ విద్యలో చేరాను. భార్య హరిత, కొడుకు నిశ్చల్‌నాగిరెడ్డి, కూతురు నాగ వైష్ణవి రెడ్డి.

వంద రోజులు..
రోజుకు ఐదు బస్సులు ప్రారంభం

గతంలో ఎప్పుడూ ఈ రాష్ట్ర చరిత్రలో లేనట్లు ఈ వంద రోజుల్లో సగటున రోజుకు కనీసం ఐదు బస్సులను ప్రారంభించి.. ప్రజలకు అంకితం చేశాము.. ఇప్పుడు 1470 కొత్త బస్సులకు ఆర్డర్ పెట్టాము. ఇప్పటికే 700 బస్సులను ప్రారంభించాము. రేపు రాబోయే ఐదు సంవత్సరాలలో ఆర్టీసీని బలోపేతం చేయడం.. ట్రాన్స్‌పోర్టు రంగంలో మార్పు తీసుకు రావాలి. దేశంలో ఎక్కువ రోడ్డు ప్రమాదాలు జరిగే రాష్ట్రాలలో మన రాష్ట్రం కూడా ఒకటిగా ఉంది. ఈ రాష్ట్రంలో రోజుకు సగటున 7 నుంచి 8 మంది ప్రమాదాలలో చనిపోతున్నారు. రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. ప్రస్తుతం బస్సుల సంఖ్య తక్కువగా ఉంది. దీనివల్ల ఉచిత ప్రయాణం పథకం ఆలస్యం అవుతోంది. త్వరలోనే ఈ పథకాన్ని ప్రారంభిస్తాము.

టీడీపీ కార్యకర్తలను ఆదుకుంటాం

వరుస ఓటముల కారణంగా టీడీపీ కార్యకర్తలు ఆర్థికంగా బాగా చితికిపోయారు. అటువంటి కుటుంబాలకే మొదటి ప్రాధాన్యత. రాజకీయంగా కూడా అటువంటి కుటుంబాలకే అవకాశాలు ఇస్తాం. మరోసారి ఇక్కడ తెలుగుదేశం పార్టీ జెండా ఎగురవేసే విధంగా పార్టీని బలోపేతం చేస్తాం.

వైసీపీ ప్రభుత్వం కొత్త బస్సులు కొనలేదు

ఐదు సంవత్సరాల వైసీపీ ప్రభుత్వంలో కొత్త బస్సు ఒకటైనా కొనలేదు. రవాణా శాఖలో ఒక బస్సు గుజరీకి వెళితే ఆ స్థానంలో కొత్త బస్సును కొనుగోలు చేయాలి. కొత్త బస్సులు కొనలేదు కాబట్టి ఫిట్‌నెస్ లేని బస్సులే తిరుగుతున్నాయి. ఇప్పుడున్న ప్రయాణీకులను బేరీజు వేసుకుంటే బస్సుల సంఖ్య చాలా తక్కువగా ఉండటంతో కండీషన్ లేని బస్సులను కూడా నడపాల్సి వచ్చింది. ఇప్పుడు కొత్తగా



సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం ఫిట్‌నెస్ లేని బస్సులను మూడు నెలల నుంచి తీసేసి గుజరీకి పంపుతున్నాము. దానికి కూడా ఒక నిబంధన ఉంది. 15 లక్షల కిలోమీటర్లు తిరిగిన, బస్సు కొన్న రోజు నుంచి 15 సంవత్సరాల పాటు తిరిగే బస్సులను గుజరీకి పంపించాలి. ఆ స్థానంలో కొత్త బస్సులు తీసుకోవాలి.

హౌసింగ్, ఉపాధిలో అక్రమాలు వెలికి తీస్తాం

గతంలో రాయచోటి నియోజకవర్గంలోని వైసీపీ నాయకులు హౌసింగ్, ఉపాధి హామీ పథకాలను తమ ఏటీఎంలుగా మార్చుకున్నారు. ఈ శాఖల్లో అంతులేని అవినీతి జరిగింది. వాటిని వెలికితీస్తాం. నారాయణరెడ్డిగారిపల్లె జగనన్న కాలనీలో 6 వేల ఇళ్లు ఉంటే..అందులో 1350 ఇళ్లు ఇంకా మొదలుపెట్టనే లేదు. ఇక్కడ నిజమైన అర్హులకు ఇవ్వలేదు. కొందరు వైసీపీ నాయకులకు ఒక్కొక్కరికి పది పట్టాలు ఇచ్చారు. వాళ్లు వాటిని పేదలకు అమ్ముకున్నారు. ఖాళీగా ఉన్న స్థలాలను రద్దు చేసి మునిసిపాలిటీ పరిధిలోని నిజమైన అర్హులకు అందిస్తాము. మునిసిపాలిటీలో ఎటువంటి అభివృద్ధి జరగలేదు. జిల్లా కేంద్రం తెచ్చామని చెప్పి.. చివరి మూడు సంవత్సరాలు.. అరకొర నిధులు తెచ్చారు అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు నిలిచిపోయాయి. అవసరం లేనిచోట అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు జరిగాయి. ఆ నిధులను డ్రా చేసుకునేందుకు. ఈ పనులను చేపట్టారు. బిల్లుల కోసమే చేశారు. కనీసం పది, ఇరవై సంవత్సరాల పాటు ఇళ్ల నిర్మాణం జరగని ప్రాంతంలో ఈ పనులు చేపట్టారు. వీటిపైన విచారణ జరిపిస్తాము.

రాయచోటి అభివృద్ధికి ప్రత్యేక కృషి

రాయచోటి బాగా వెనుకబడిన ప్రాంతం. రాష్ట్రమంతా వర్షాలు వచ్చి కొట్టుకుపోతుంటే.. రాయచోటిలో వాన లేదు. తాగడానికి గుక్కెడు నీళ్లు లేవు. రాయచోటి ప్రాంతంలో తాగునీరు, సాగునీరు సౌకర్యాల లోటు లేకుండా చేసేందుకు.. ఈ ప్రాంతానికి సాగునీరు, తాగునీటి ప్రాజెక్టుల కోసం ముఖ్యమంత్రితో మాట్లాడి అవసరమైన నిధులు తెచ్చేందుకు కృషి చేస్తాను.

పాతికేళ్లు అధికారానికి దూరంగా..

గత 40 సంవత్సరాలుగా ప్రత్యక్ష రాజకీయాల్లో ఉన్న మా కుటుంబం. 1999 ఎన్నికల్లో ఓటమి తర్వాత అధికారానికి దూరంగా ఉంది. అప్పటి నుంచి నిన్నటి విజయం వరకు ఎన్నో కష్టాలు పడ్డాము. 1985లో మా తండ్రి గెలిచినప్పటి నుంచి నియోజకవర్గంలో బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీలు, ఇతర వర్గాలతో మా కుటుంబానికి మంచి సంబంధాలు ఉన్నాయి. ఓటమి ఎదురైనా భయపడకుండా నియోజకవర్గం వదిలిపోకుండా.. ప్రజల్లో ఉండడమే నా గెలుపునకు కారణం. ఏ నాయకుడైతే.. ప్రజలతో ప్రత్యక్షంగా మంచి సంబంధాలు పెట్టుకుంటారో.. వాళ్లు రాజకీయంగా ఓటమి చెందేది ఉండదు. ఒకవేళ ఓటమి చెందినా.. రెండవ సారైనా గెలుపు దక్కుతుందనడానికి నేనే ఉదాహరణ. మంత్రిగా ఎంత బిజీగా ఉన్నప్పటికీ నెలలో 15 రోజులు రాయచోటి నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటాను. వాళ్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాను.

జిల్లాలో 111 మద్యం షాపులు

- మద్యం షాపులకు దరఖాస్తుల ఆహ్వానం
- కలెక్టర్ చామకూరి శ్రీధర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), అక్టోబరు 1: నూతన మద్యం పాలసీ అమలులో భాగంగా జిల్లాలో 111 మద్యం షాపులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నూతన మద్యం పాలసీపై రాష్ట్ర ప్రభుత్వం జీవో-211ను విడుదల చేసిందని ఈ జీవోలోని నిబంధనల మేరకు మద్యం షాపుల ఏర్పాటు, నిర్వహణ ఉండబోతోందని తెలిపారు. జిల్లాకు సంబంధించి 111 షాపులకు ఈనెల 1వ తేదీ నోటిఫికేషన్ విడుదలైందని, ఈ నెల 9వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్‌లో కానీ, ఆఫ్‌లైన్‌లో కానీ దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని తెలిపారు. 11వ తేదీ కలెక్టర్ లాటరీ పద్ధతి ద్వారా మద్యం షాపుల ఏర్పాటుకు ఎంపికైన దరఖాస్తులను ఖరారు చేస్తామన్నారు. మద్యం షాపుల ఏర్పాటుకు ఔత్సాహికులు ముందుకు వచ్చి దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. ఒక వ్యక్తి ఎన్ని షాపులకైనా దరఖాస్తు చేసుకోవచ్చని, ప్రతి దరఖాస్తుకు రూ.2 లక్షలు రుసుం చెల్లించాలని, ఆ రుసుం తిరిగి ఇవ్వబడదని తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, జిల్లా ఎక్సైజ్ శాఖాధికారి మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయండి : కలెక్టర్

రాయచోటి(కలెక్టరేట్), అక్టోబరు 1: ఓటర్ల సవరణ ప్రక్రియలో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదేశించారు. మంగళవారం ఉదయం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వివేక్‌యాదవ్ విజయవాడలోని తన కార్యాలయం నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇంటింటికి వెళ్లి చేసే సర్వే ప్రక్రియ 99.59 శాతం పూర్తయిందని, కొన్ని ఫారాలు క్లియర్ కావాల్సి ఉందని తెలిపారు. పోలింగ్ కేంద్రాల మార్పులు, చేర్పులపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం తదితర కార్యక్రమాలు పూర్తి చేశామని వివరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు స్వచ్ఛతా హీ సేవ ఉత్తమ అవార్డు

రాయచోటి(కలెక్టరేట్), అక్టోబరు 1: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో ఉత్తమ పని తీరుతో మంచి కార్యక్రమాలు నిర్వహించినందుకు జిల్లాకు అవార్డు వచ్చిందని కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్వచ్ఛతా హీ సేవా గ్రామీణ విభాగంలో,సఫాయి మిత్ర సురక్ష కాంపొనెంట్‌లో అన్నమయ్య జిల్లా ఉత్తమ అవార్డు పొందిందని తెలిపారు. ఈ అవార్డును జిల్లా తరపున డీపీవో ధనలక్ష్మి ఈనెల 2వ తేదీ బుధవారం మచిలీపట్నంలో జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా జిల్లా కలెక్టర్ తరఫున అందుకుంటారని తెలిపారు. జిల్లాకు అవార్డు రావడానికి కృషి చేసిన అధికారులకు ఈ సందర్భంగా కలెక్టర్ అభినందనలు తెలిపారు.

పోలీస్‌స్టేషన్‌లో మహిళ ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న సుగుణమ్మ

పీలేరు, అక్టోబరు 1: తమ కుటుంబానికి ప్రాణభయం ఉందని ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోవడం లేదని మహిళ పోలీసు స్టేషన్‌లోనే పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. కుటుంబ సభ్యులు, స్థానికుల సమాచారం మేరకు... పీలేరు మండలం కాకులారంపల్లె పంచాయతీ ఇందిరమ్మ కాలనీలో నివాసం ఉంటున్న సుగుణమ్మ ఇంటిపై రెండు నెలల క్రితం కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు క్షుద్ర పూజలు చేశారు. ఇది గమనించిన సుగుణమ్మ కుటుంబ సభ్యులు భయంతో ఇంటి చుట్టూ సీసీ కెమెరాలు అమర్చారు. ఈ నేపథ్యంలో ఇదే కాలనీకి చెందిన నాగరాజు అనే వ్యక్తి సెప్టెంబరు 19న సుగుణమ్మ ఇంటి చుట్టూ మరోసారి క్షుద్ర పూజలు నిర్వహించి ఇంటి చుట్టూ అక్షింతలు చల్లాడు. ఈ దృశ్యాలన్నీ సీసీ కెమెరాల్లో నమోదయ్యాయి. దీంతో సుగుణమ్మ కుటుంబ సభ్యులు సాక్ష్యాధారాలతో సహా పీలేరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలోనే నాగరాజు కుమార్తె అపరంజి సుగుణమ్మ తమ్ముడు సత్యనారాయణ తనపై అత్యాచారయత్నం చేసినట్లు ఎస్పీకి ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు ఇరువైపుల నుంచి బాధితులను రప్పించారు. ఈ దశలో విచారణ చేస్తున్న తీరుపట్ల మనస్తాపం చెందిన సుగుణమ్మ పోలీసుస్టేషను ఆవరణలోనే తన వెంట తెచ్చుకున్న పురుగుల మందు తాగింది. ఆమెను వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే ఆమె పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. ఇదే విషయమై సీఐ యుగంధర్‌ను వివరణ కోరగా ఇరువర్గాల ఫిర్యాదులపై విచారణ జరుపుతుండగా హఠాత్తుగా ఘటన చోటు చేసుకున్నట్లు తెలిపారు.

పింఛన్లతో పేదల జీవితాల్లో వెలుగులు

- అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది
- పింఛన్ల పంపిణీలో మంత్రి మండిపల్లి

రాయచోటిటౌన్, అక్టోబరు 1: ఎన్టీఆర్ భరోసా పింఛన్లతో ప్రభుత్వం పేద, బడుగు వర్గాల జీవితాల్లో వెలుగులు నింపుతోందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఉదయం 7 గంటలకు ఆయన ఎన్టీఆర్ భరోసా పథకం కింద రాయచోటి పట్టణంలోని వీరభద్రస్వామి గుడి వెనుక 30వ వార్డులో లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అవ్వాతాతలు, వితంతువులు, వైకల్యం ఉన్న వారిని మంత్రి ఆప్యాయంగా పలకరిస్తూ వారి యోగక్షేమాలను విచారించి పింఛన్ల డబ్బు అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ సమాజంలోని అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పింఛన్ల మొత్తాన్ని పెంచి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పేద, బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలుస్తున్నారని చెప్పారు. ముఖ్యంగా వృద్ధులు, బలహీనులు, వితంతువులు, వైకల్యం ఉన్న వారు మొదలైన వారి కష్టాలను తీర్చడానికి గౌరవ ప్రదమైన జీవితాన్ని పొందేందుకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ప్రభుత్వం అందజేస్తోందన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా, పట్టణ అధ్యక్షుడు బోనమల ఖాదర్‌వలి, మండల మాజీ ఉపాధ్యక్షులు అనుంపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ప్రైవేటు కళాశాలల అసోషియేషన్ అధ్యక్షుడు డాక్టర్ పి.మదన్‌మోహన్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ రషీద్, తెలుగు యువత అధ్యక్షుడు మహబూబ్ అలీఖాన్, టీడీపీ నేతలు కోడి శ్రీనివాసులరెడ్డి, జయరాంరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, శివారెడ్డి, కారంశెట్టి గిరి, ఖాదర్‌మోదీన్, వెంకటశివారెడ్డి, మున్సిపల్ కమిషనర్ వాసుబాబు, అర్బన్ సీఐ చంద్రశేఖర్, రూరల్ సీఐ వరప్రసాద్, ఎస్ఐ నరసింహారెడ్డి, పోలీసు సిబ్బంది, వార్డు సచివాలయ సిబ్బంది, పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



రాయచోటిలో పింఛన్ పంపిణీ చేస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

అతివేగం... నిర్లక్ష్యం...





ప్రమాదంలో గాయపడ్డ వారు



సర్కారుతోపు వద్ద కంటైనర్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- సర్కారుతోపు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం
- ఆర్టీసీ బస్సు, కంటైనర్ ఢీ... 40 మందికి గాయాలు
- ఆరుగురి పరిస్థితి విషమం
- క్షతగాత్రులను పరామర్శించిన ఎమ్మెల్యే, సబ్ కలెక్టర్, డీఎస్పీ

కురబలకోట/మదనపల్లె అర్బన్, అక్టోబరు 1: అతివేగం, నిర్లక్ష్యం కారణంగా ముంబై-చెన్నై ప్రధాన జాతీయ రహదారిలోని సర్కారుతోపు వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో దాదాపు 40 మంది తీవ్రంగా గాయపడ్డారు. స్థానిక పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మదనపల్లె-2 డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు గాలివీడు నుంచి మదనపల్లెకు వస్తుండగా మంగళవారం మధ్యాహ్నం సర్కారుతోపు వద్ద ఎదురుగా వస్తున్న కంటైనర్‌ను ఢీకొంది. ప్రమాదంలో ఆర్టీసీ బస్సులోని డ్రైవర్, కండక్టర్‌తో పాటు 40 ప్రయాణికులు గాయపడ్డారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్ బస్సులోనే ఇరుక్కుపోవడంతో స్థానికులు జేసీబీ సాయంతో వాహనం ముందు భాగాన్ని తొలగించి అతడిని బయటకు తీశారు. క్షతగాత్రులను 108, ప్రైవేట్ వాహనాల సాయంతో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్యచికిత్సలు అందించారు. కాగా వీరిలో తీవ్రంగా గాయపడి అపస్మారకస్థితికి చేరుకున్న మదనపల్లె మండలం సీటీఎం పంచాయతీ రెడ్డివారిపల్లెకు చెందిన రైతు వెంకటసుబయ్య, ఆర్టీసీ బస్సు డ్రైవర్ రామకృష్ణ, కండక్టర్, గుర్రంకొండ మండలం నడిమికండ్రిగకు చెందిన రైతు గిరిబాబు, పెద్దమండ్యం మండలం సిద్ధవరంకు చెందిన పద్మజల పరిస్థితి ఆందోళకరంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతి, బెంగళూరు ఆసుపత్రులకు తరలించారు. గాయపడ్డ వారికి మదనపల్లె ప్రభుత్వాసుపత్రిలో చికిత్సలు అందిస్తున్నారు. ప్రమాద విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, డీఎస్పీ దర్బార్ కొండయ్య నాయుడు, రాజంపేట పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు సురేంద్రయాదవ్‌లు ఆసుపత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించి మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని సూపరింటెండెంట్ ఎంఎస్ రాజును ఆదేశించారు. క్షతగాత్రులు, వారి కుటుంబీకుల రోదనలు ఆసుపత్రిలో మిన్నంటాయి. ప్రమాదం కారణంగా రోడ్డుకు ఇరువైపులా వాహనాలు బారులు తీరి నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ముదివేడు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. మదనపల్లె డీఎస్పీ దర్బార్ కొండయ్య నాయుడు ప్రమాదం జరిగిన సంఘటనాస్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. కాగా ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేయాలని సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ సంబంధిత శాఖాధికారులను ఆదేశించారు. ఈ మేరకు ముదివేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజరు గీత, ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు సురేష్, బీసీఎస్ నాయక్, సీఏ బాషా, షూల శ్రీనివాసులు తదితరులు క్షతగాత్రులను పరామర్శించారు.



జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజుకు సూచనలు ఇస్తున్న సబ్‌కలెక్టర్ మేఘ స్వరూప్, ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

రోడ్డు ప్రమాదమా... హత్యాయత్నమా?

కాళ్లను రంపంతో కోసినట్లు ఆనవాలు



రక్తగాయాలతో పడివున్న కానిస్టేబుల్ శ్రీనివాస్‌రెడ్డి

పెండ్లిమర్రి, అక్టోబరు 1: యోగివేమన యూనివర్సిటీ బైపాస్‌రోడ్డులో సోమవారం అర్ధరాత్రి కానిస్టేబుల్ శ్రీనివాసరెడ్డి నడిరోడ్డుపై రెండు కాళ్లు విరిగి పడివున్నాడు. అయితే కానిస్టేబుల్ ప్రమాదానికి గురయ్యాడాలేక, హత్యాయత్నం జరిగిందా అనే విషయం స్పష్టంగా తెలియడం లేదు. వివరాల్లోకెళితే.... వీరపునాయునిపల్లె మండలం మొయిళ్లచెరువు వాసి శ్రీనివాస్‌రెడ్డి వేంపల్లె పోలీస్‌స్టేషన్‌లో కోర్టు కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కాగా విధినిర్వహణలో భాగంగా వేంపల్లె నుంచి కడపవైపు కారులో వస్తుండగా పులివెందుల ప్రధాన రహదారిపై యోగివేమన యూనివర్సిటీ బైపాస్‌రోడ్డుపై ఘటన జరిగింది. కాగా కానిస్టేబుల్ విధి నిర్వహణలో భాగంగా విజయవాడకు వెళుతున్నట్లు తెలుస్తోంది. కానిస్టేబుల్ డ్రస్‌లో ఉన్న శ్రీనివాసరెడ్డికి రెండు కాళ్లు విరిగి రోడ్డుపై పడి వున్న ఘటన తీరు చూస్తే ప్రమాదానికి గురైనట్లు లేదు. రెండుకాళ్లను రంపంతో కోసినట్టుగా ఉంది. కానిస్టేబుల్‌ను చికిత్స నిమిత్తం వేలూరు సీఎంసీ ఆస్పత్రికి తరలించారు. ఎవరో కానిస్టేబుల్‌పై హత్యాయత్నం చేసినట్లు ఉంది. ఈ విషయమై పెండ్లిమర్రి పోలీసులను వివరణ కోరగా ఇప్పటి వరకు ఎవరూ ఫిర్యాదు చేయలేదని తెలిపారు.

స్వర్ణాంధ్ర సాధన డిబేట్‌లో మోడల్ స్కూల్ విద్యార్థులు



అన్నమయ్య జిల్లా కలెక్టర్ నుంచి ప్రశంసా పత్రాలు అందుకుంటున్న విద్యార్థులు

నంబేపల్లె, అక్టోబరు1: స్వర్ణాంధ్ర సాధన 2047 డిబేట్‌లో జిల్లా స్థాయిలో జరిగిన పోటీల్లో నంబేపల్లె ఆదర్శ పాఠశాలకు చెందిన ఎస్. యశ్వంత్‌రెడ్డి, డీ. మంజుల విశేష ప్రతిభ కనపర్చి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ దిలీప్‌కుమార్ తెలిపారు. సెప్టెంబరు 30న జిల్లా స్థాయిలో జరిగిన పోటీల్లో ప్రథమ స్థానం సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. సెప్టెంబరు 30 సోమవారం కలెక్టర్ చామకూరి శ్రీధర్, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ నుంచి ప్రశంసా పత్రాలను అందుకున్నట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు. పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మెన్ రెడ్డిమోహన్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అట్టహాసంగా రాష్ట్రస్థాయి కరాటే పోటీలు



హోరాహోరీగా జరిగిన కరాటే పోటీలు

రాజంపేట, అక్టోబరు 1: రాజంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మంగళవారం రాష్ట్ర స్థాయి అండర్-19 కరాటే పోటీలు నిర్వహించారు. రాష్ట్రంలోని ఉమ్మడి జిల్లాల బాల బాలికలు పాల్గొన్నారు. ఆర్‌జేడీ రవి, ఎస్‌జీఎఫ్ ఏపీజీ భానుమూర్తిరాజు మాట్లాడుతూ దేశంలో యువతీ యువకులకు కొదవ లేదని, వీరిని ప్రోత్సహిస్తే ప్రపంచంలోనే దేశానికి కీర్తి ప్రతిష్ఠలు తీసుకువస్తారన్నారు. పోటీల్లో విజేతలుగా నిలిస్తే జాతీయ స్థాయికి పంపుతామన్నారు. చదువుతో పాటు క్రీడలకు కూడా అధిక ప్రాధాన్యత ఇస్తేనే ఉపయోగం ఉంటుందన్నారు. జిల్లా కరాటే పోటీల ఆర్గనైజింగ్ సెక్రటరీ శారద, టోర్నమెంట్ పరిశీలకులు విజయప్రసాద్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ఎస్‌వీ రమణరాజు, కరాటే పోటీల నిర్వాహక కమిటీ సభ్యులు సుబ్బరాజు, మురళీక్రిష్ణారెడ్డి, రాష్ట్రంలోని అనేక విద్యాలయాల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాజంపేట ట్రెజరీలో పురాతన నాణేలు మాయం

రాజంపేట టౌన్, అక్టోబరు 1: ట్రెజరీ కార్యాలయంలో భద్రపరిచిన పురాతన నాణేలు మాయమైనట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎల్లమరాజు తెలిపారు. 2021లో తవ్వకాల్లో ఓ కుండలో దొరికిన 21 గ్రాముల బరువు గల 78 నాణేలు సీజ్ చేసి రాజంపేట ట్రెజరీ కార్యాలయం స్ట్రాంగ్ రూములో భద్రపరిచినట్లు తెలిపారు. 2024లో సార్వత్రిక ఎన్నికల సమయంలో ఓబులవారి పల్లెలో డబ్బు పంచుతున్న వారి నుంచి రూ.12 వేలను స్వాధీనం చేసుకుని ట్రెజరీలో భద్రపరిచారు. కేసు విషయమై ఓబులవారిపల్లె ఎస్ఐ సీజ్ చేసిన మొత్తాన్ని కోర్టుకు హాజరు పర్చాల్సి ఉండగా వాటిని స్వాధీనపరుచుకునేందుకు ట్రెజరీ అధికారులను కోరారు. అయితే భద్రపరిచిన ప్రదేశంలో పాత నాణేలు, 12 వేల నగదు మాయమైనట్లు గుర్తించిన అధికారులు సెప్టెంబరు 21న పోలీసులకు ఫిర్యాదు చేశారు. జిల్లా ట్రెజరీ అధికారి సూచన మేరకు ట్రెజరీలో అటెండర్‌పై అనుమానంతో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

వేధింపులతో నవవధువు ఆత్మహత్య



ప్రొద్దుటూరు, అక్టోబరు 1: కట్టుకున్న భర్త వేధింపులు తాళలేక ఓ నవవధువు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. వివారాల్లోకెళితే.... సూపర్ బజార్ వీధికి చెందిన పల్లా కీర్తి కడప ఎర్రముక్క పల్లికి చెందిన బొమ్మిశెట్టి విజయ్‌కుమార్‌కు ఇచ్చి ఏడు నెలల కిందట వివాహం జరిపించారు. కీర్తికి తండ్రిలేడు తల్లి నర్సమ్మ వుంది. భర్త విజయ్‌కుమార్‌కు పెళ్లి కాకముందు నుంచే పలు వురు మహిళలతో వివాహేతర సంబంధం వుండేదని ఆ విషయంపై తరుచూ గొడవ పడేవారు. తీరు మార్చుకోమని భర్తకు చెప్పినా వినకుండా కీర్తినే వేధించేవాడని కుటుంబ సభ్యులు వాపోయారు. ఈక్రమంలో భర్త వేధింపులు తాళలేక ఆమె పుట్టింటికి వచ్చి తల్లి ఇంట్లో లేని సమయంలో ఉరేసుకుంది. తల్లి నరసమ్మ త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. రాత్రి 9 గంటలకు సంఘటనా స్థలం చేరుకుని ఆత్మహత్యకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. కీర్తి మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కీర్తి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు భర్తపై కేసు నమోదు చేసినట్లు సీఐ గోవిందరెడ్డి తెలిపారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

కడప (క్రైం), అక్టోబరు 1: కడప - కనుమలోపల్లి రైల్వేస్టేషన్ల మధ్య మంగళవారం ఓ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడినట్లు కడప రైల్వేపోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు.. ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి వయసు 45 నుంచి 50 ఏళ్లు ఉంటాయని, కుడిచేతిపై త్రిశూలం ఆకుపచ్చ బొట్టు, ఇత్తడి ఉంగరం ఉన్నట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పింఛన్ తీసుకుని వెళ్తూ వితంతువు మృతి



వేంపల్లె, అక్టోబరు 1: పాములూరు సచివాలయం వద్ద వితంతు పింఛన్ తీసుకుని తిరిగి వెళ్తూ అకస్మాత్తుగా అమ్మగారిపల్లె వాసి బోగాది రాజ్యలక్ష్మి (49) మృతిచెందారు. వేంపల్లె రాజీవ్‌నగర్ కాలనీ వాసి ఆమె స్వగ్రామం అమ్మగారిపల్లె. ప్రతి నెలా పాములూరు సచివాలయం, లేదా అమ్మగారిపల్లెకు వెళ్లి పింఛన్ తీసుకునేది. మంగళవారం పాములూరు సచివాలయంలో పింఛన్ తీసుకున్న అనంతరం నడిచి వెళ్తుండగా ఉన్నట్లుండి కిందపడిపోయి మృతిచెందింది. సచివాలయ ఉద్యోగులు బంధువులకు సమాచారం అందించి మృతదేహాన్ని వేంపల్లెకు తరలించారు. పింఛన్ కోసం వచ్చి మృతిచెందడం పట్ల స్థానికులు విచారం వ్యక్తం చేశారు.

ప్రమాదానికి గురైన మహిళా పోలీస్

సుండుపల్లె, అక్టోబరు1: పొలిమేరపల్లి పంచాయతీ మహిళా పోలీస్ వరలక్ష్మి మంగళవారం ఉదయం 6 గంటలకు పింఛన్ పంపిణీ కార్యక్రమానికి వెళుతూ రోడ్డు ప్రమాదానికి గురై కాలు విరిగినట్లు కుటుంబీకులు తెలిపారు. ఉదయాన్నే పింఛన్ అందించాలని స్కూటీ మీద వెళ్తుండగా ఎదురుగా వస్తున్న వాహనం వెలుతురు కళ్లలో పడి అదుపు తప్పి కింద పడినట్లు తెలిపారు. కుడికాలు విరగడంతో రాయచోటిలోని సాయి ప్రశాంతి హాస్పిటల్‌లో వైద్యం పొందుతుననట్లు తెలిపారు. గాయాలపాలైన వరలక్ష్మిని మండల అధికారులు పరామర్శించారు.

చెన్నూరులో భారీగా చోరీ

చెన్నూరు, అక్టోబరు 1: స్థానిక పాత స్టేట్‌బ్యాంకు వీధిలో నివాసం ఉంటున్న పెడబల్లె రాజేశ్వరమ్మ ఇంట్లో దొంగలు పడి బీరువా పగలగొట్టి అందులో ఉన్న 50 గ్రాముల బంగారు నగలు, ఒకటిన్నర కిలో వెండి వస్తువులు, రూ.80వేలు నగదు దోచుకెళ్లారు. దొంగలు కిటికీ ఊచలు కత్తిరించి చోరీ చేశారు. బాధితురాలు రాజేశ్వరమ్మ ఇంట్లో ఒంటరిగా ఉండలేక హైదరాబాదులో ఉన్న కుమారుడు వద్దకు వెళ్లి ప్రతి నెలా 1న పెన్షన్ కోసం చెన్నూరులోని తన ఇంటికి వచ్చేది. మంగళవారం ఉదయం హైదారబాదు నుంచి ఇంటికి వచ్చిన ఆమె ఇంటి తాళం తీసి లోపలికి వెళ్లగా బీరువా పగలగొట్టబడి ఉండడం, బట్టలు చెల్లాచెదరుగా ఉండడం చూసి భయపడింది. బంగారు, వెండి నగదు కనిపించకపోవడంతో దొంగలు దోచుకెళ్లారని భయపడింది. వెంటనే పోలీసుస్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో సీఐ పురుషోత్తంరాజు సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. బాధితురాలు ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రాష్ట్ర క్రీడలకు వీరబల్లి విద్యార్థులు

కబడ్డీలో ప్రతిభ చాటిన రెడ్డికావ్య ● వీరబల్లి నుంచి ఎనిమిది మంది, టంగుటూరు నుంచి ఏడుగురు ఎంపిక





వీరబల్లి, సుండుపల్లె నుంచి రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయ సిబ్బంది, వ్యాయామ ఉపాధ్యాయులు

వీరబల్లి, అక్టోబరు1: ఎస్‌జీఎఫ్ క్రీడల్లో వీరబల్లి జడ్పీ హైస్కూల్ నుంచి ఎనిమిది మంది విద్యార్థులు, నందలూరు మండలం టంగుటూరు హైస్కూల్ నుంచి ఏడుగురు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రెడ్డెయ్య వేణుమాధవరాజు, శ్రీనివాసులు తెలిపారు. అన్నమయ్య జిల్లా రాయచోటి మాసాపేటలో జరిగిన ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయిలో ప్రతిభ చూపి ఒకే పాఠశాల నుంచి రాష్ట్ర స్థాయికి 8 మంది ఎంపికైనట్లు ఇన్‌చార్జి హెచ్‌ఎం తెలిపారు. సాఫ్ట్‌బాల్ అండర్-17 బాలుర విభాగంలో భరత్, నాసర్, బాలికల విభాగంలో కావ్య, అండర్-17 బేస్‌బాల్ బాలుర విభాగంలో నాసర్, అండర్-14లో స్వాతిక్ ఎంపికయ్యారు. వీరిని మంగళవారం జడ్పీ పాఠశాలలో జరిగిన సమావేశంలో ఎంపీడీఓ మల్లీశ్వరి, ఇన్‌చార్జి హెచ్‌ఎం రెడ్డెయ్య, వీఆర్‌డీఎస్ చైర్మెన్ సురేంద్రారెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు డీవీఎస్ కుమార్, రామచంద్ర, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలకు ఉప్పరపల్లి విద్యార్థిని

డాక్టర్ అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాలలో మంగళవారం జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-17 కబడ్డీ బాలికల విభాగంలో రెడ్డికావ్య ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు హెచ్‌ఎం చంద్రశేఖర్, పీడీ శేఖర్ తెలిపారు. ఈమెను వారు సత్కరించారు. జాతీయ స్థాయిలో గెలుపొందాలని ఆకాక్షించారు.

టంగుటూరు విద్యార్థులు...

నందలూరు, అక్టోబరు 1: ఉమ్మడి కడప జిల్లా స్థాయిలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన మల్కంమోద్రన్, పెంటతిరియన్, రగ్బీ, షూటింగ్‌బాల్, రోప్ స్కిప్పింగ్ పోటీల్లో టంగుటూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు ఏడుగురు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు తూర్పుగోదావరి జిల్లా భీమవరం, కర్నూలు, ఏలూరు, శ్రీకాకుళం జిల్లాల్లో ఆయా క్రీడల తేదీల ప్రకారం జరిగే పోటీలకు వెళ్లాల్సి ఉంటుందన్నారు. ఫిజికల్ డైరెక్టర్ గణేష్ బాబు, చాన్‌బాషా, మస్తానయ్య, రమేష్‌బాబు, లక్ష్మీనారాయణరెడ్డి, మోహన్‌రాజు, లక్ష్మీదేవి, శశికళ, రజని, నాగార్జున, బాదుల్లా, ఎంపికైన విద్యార్థులను సత్కరించారు.

రాష్ట్ర పోటీలకు సుండుపల్లె విద్యార్థులు

సుండుపల్లె, సెప్టెంబరు1: సుండుపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మాసాపేటలో జరిగిన పోటీల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు రవీంద్రరాజు తెలిపారు. అండర్-17 సాఫ్ట్‌బాల్‌కు ఆంజనేయులు, వెంకటేశ్వర్లు, బేబి, అండర్-17 బేస్‌బాల్‌కు ఉదయ్‌కిరణ్, భరత్‌కుమార్, బేబి, అండర్-14 బేస్‌బాల్‌కు కిరణ్ కుమార్, వంశీ, సంధ్య, అండర్-14 సాఫ్ట్‌బాల్‌కు అభి, కిరణ్‌కుమార్, జేష ఎంపికయ్యారు. సుండుపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి జిల్లా జట్టుకు ఎంపికై రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు వెళ్లడం ఆనందంగా ఉందని ప్రధానోపాధ్యాయులు జయన్న హర్షం వ్యక్తం చేశారు. అలాగే వ్యాయామ ఉపాధ్యాయులను విద్యార్థినీ, విద్యార్థులను పాఠశాల సిబ్బంది అభినందించారు.

వైసీపీకి మున్సిపల్ కౌన్సిలర్ల షాక్

ఎమ్మెల్యే ఆధ్వర్యంలో టీడీపీలో చేరిక ● మొత్తం 16కు పెరిగిన బలం



ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరిన వైసీపీ కౌన్సిలర్లు

ప్రొద్దుటూరు, అక్టోబరు 1: ప్రొద్దుటూరులో వైసీపీకి మున్సిపల్ కౌన్సిలర్లు వరుసగా షాక్ ఇస్తున్నారు. కౌన్సిలర్లు పల్లా రమాదేవి, జిలాన్‌బాషా ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. మంగళవారం నెహ్రూరోడ్డులోని టీడీపీ కార్యాలయంలో వీరికి పార్టీ కండువాలు కప్పి ఎమ్మెల్యే పార్టీలోకి ఆహ్వానించారు. సరిగ్గా నాలుగు రోజుల కిందట 39, 33వ వార్డుల వైసీపీ కౌన్సిలర్లు చింపిరి అనిల్, గాజుల శివజ్యోతి టీడీపీలో చేరారు. వీరి చేరికతో మున్సిపల్ కౌన్సిల్‌లో టీడీపీ బలం 16కు చేరింది. కౌన్సిల్ మొత్తం 40 మంది కాగా త్వరలో మరికొందరు వైసీపీ కౌన్సిలర్లు టీడీపీలో చేరనున్నారు. దీంతో మెజార్టీ కౌన్సిలర్లు టీడీపీలో చేరితే కౌన్సిల్ టీడీపీ వశమైనట్లేనని భావిస్తున్నారు. త్వరలోనే మున్సిపల్ కౌన్సిల్ టీడీపీ కైవశం చేసుకోబోతుందని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ప్రకటించారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు తోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని నమ్ముతూ వైసీపీ నుంచి స్వచ్ఛందంగా టీడీపీలో చేరారు. టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి సురేష్‌నాయుడు మాట్లాడుతూ ప్రొద్దుటూరు అభివృద్ధి చెందాలంటే టీడీపీతోనే సాధ్యమని వారంతా వైసీపీని వీడి టీడీపీలోకి వస్తున్నారన్నారు. వీరందరికీ పార్టీ అన్ని విధాలా అండగా వుంటుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఇన్‌చార్జ్ చైర్మెన్ వీఎస్ ముక్తియార్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఈవీ సుధాకర్‌రెడ్డి, టౌన్ బ్యాంకు చైర్మెన్ సుబ్బారెడ్డి, టీడీపీ మాజీ పట్టణ అధ్యక్షుడు ఘంటశాల వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ వంగనూరు మురళీధర్‌రెడ్డి, కమాల్‌బాషా, మాజీ కౌన్సిలరు జంబాపురం రామాంజనేయులు, టీడీపీ నేతలు పగిడాల దస్తగిరి వద్ది ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

రాయచోటిలో క్రీడా పాఠశాల ఏర్పాటు చేస్తాం

ఇండోర్ స్టేడియం అభివృద్ధికి కృషి : మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

క్రీడా పరికరాలకు ఎన్‌ఆర్ఐ భూషణం శశివర్మ చేయూత



లక్ష రూపాయల నగదును క్రీడా సామగ్రికి అందజేస్తున్న దాత భూషణం శశివర్మ

సంబేపల్లె, అక్టోబరు1: అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గంలో ఇండోర్ స్టేడియం, క్రీడా పాఠశాల మంజూరు చేస్తామని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి హామీ ఇచ్చారు. మంగళవారం సంబేపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్య, క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యమని క్రీడల పట్ల ప్రతి ఒక్కరూ ఆసక్తి చూపి ఆరోగ్యంగా ఉండాలన్నారు. క్రీడలకు మౌలిక సదుపాయాలను కల్పిస్తామన్నారు. క్రీడల్లో ప్రతిభ చూపిన వారికి విద్య, ఆరోగ్య అవకాశాల్లో రిజర్వేషన్ సౌకర్యం కలదన్నారు. సంబేపల్లెకు చెందిన ఎన్‌ఆర్ఐ భూషణం శశివర్మ లక్ష రూపాయలు విలువ గల క్రీడా వస్తువులను సంబేపల్లె పాఠశాలకు ఇవ్వడం గొప్ప విషయమన్నారు. దాతను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. అనంతరం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన దేవప్రసాద్ రెడ్డిని సత్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నరసింహారెడ్డి, మాజీ జడ్పీటీసీ మల్లు నరసారెడ్డి, మాజీ సర్పంచులు శశిధర్‌రెడ్డి, గోపాల్, ఎన్నారై భూషణ్‌శశివర్మ, పాఠశాల విద్యాకమిటీ చైర్మెన్‌లు రెడ్డిరాణిరెడ్డి, రెడ్డిమోహన్, టీడీపీ నేతలు కొండా భాస్కర్‌రెడ్డి, కొండమర్ల రామచంద్ర నాయుడు, మట్లి శ్రీనివాసులు నాయుడు, మాధం బసిరెడ్డి, శివప్రసాద్‌రెడ్డి, గొల్లపల్లి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈతకెళ్లి ఇద్దరు పిల్లలు మృతి



షేక్ యాసిన్, రఫీ ఫైల్ ఫొటోలు

మైదుకూరు రూరల్, అక్టోబరు 1: స్థానిక విజయ్ సినిమా హాల్ సమీప కేసీ కెనాల్‌లో ఈతకు వెళ్లిన షేక్ యాసిన్(9), షేక్ రఫీ (9) గల్లంతయ్యారని పోలీసులు తెలిపారు. మంగళవారం సాయంత్రం కాల్వలో ఈతకు వెళ్లిన పిల్లలు రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు, ఫైర్ సిబ్బంది కలిసి కేసీ కెనాల్‌లో వెదికారు. రాత్రి తొమ్మిది గంటలకు యాసిన్ మృత దేహం లభ్యమైంది. రఫీ కోసం అధికారులు గాలిస్తున్నారు. వివరాల్లోకెళితే శాంతినగర్ వాసులు షేక్ మత్తున్, షేక్ కోహిమా ఐదో సంతానం షేక్ యాసిన్, షేక్ మాలిక్, హూసేన్ మూడో కుమారుడు షేక్ రఫీ ఆర్‌సీఎం స్కూల్‌లో నాల్గోవ తరగతి చదువుతున్నారు. ఇద్దరూ కలిసి ఇంటి వద్దే ఆడుకుంటూ పక్కనే ఉన్న కేసీ కెనాల్‌లో ఈత కొట్టడానికి వెళ్లారు. పనికెళ్లి ఇంటికి వచ్చిన తల్లిదండ్రులకు పిల్లలు కనిపించకపోవడంతో విచారించగా ఈతకు వెళ్లినట్లు తెలిపారు. పిల్లలు కనిపించకపోవడంతో పోలీసులకు సమాచారం ఇవ్వగా పోలీసులు రాత్రి పొద్దు పోయే వరకూ గాలించగా ఒకరి మృతదేహం దొరికింది. మరొక చిన్నారి మృతదేహం దొరకాల్సివుంది.

తల్లిదండ్రులను మించిన దైవం లేదు : కలెక్టర్



వృద్ధులతో కలెక్టర్ శివశంకర్

కడప(కలెక్టరేట్) అక్టోబరు 1: వృద్ధాప్యంలో తల్లి, దండ్రుల పట్ల ఆప్యాయత, ప్రేమతో నడుచుకోవాలనీ, తల్లి దండ్రులను మించిన దైవం లేదని కలెక్టర్ శివశంకర్ అన్నారు. కలెక్టరేట్ లోని పీజీఆర్‌ఎస్ సమావేశ మందిరంలో విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో మానవత్వ మనుగడకు నైతిక విలువలు ఎంతో అవసరమన్నారు. పాఠశాలల్లో వారంలో ఒక రోజు సుమతీ శతకం, నీతి శతకం, నైతిక విలువలపై విద్యార్థులకు బోధించేలా చర్యలు తీసుకుంటామన్నారు. సంక్షేమశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కృష్ణ కిశోర్, డీఆర్డీఏ పీడీ ఆనంద్ నాయక్, అధికారులు సురేష్ కుమార్ పాల్గొన్నారు.

ఎక్సైజ్ కానిస్టేబుళ్ల బదిలీ

కడప (క్రైం), అక్టోబరు 1: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ కానిస్టేబుళ్లను బదిలీ చేస్తూ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనరు జయరాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా వ్యాప్తంగా 75 మందికి స్థాన చలనం కల్పించారు. బదిలీ అయిన వారు తక్షణమే కేటాయించిన స్థానాల్లో బాధ్యతలు స్వీకరించాలని ఆదేశాలు జారీ చేశారు.

48 గంటల్లో విగ్రహాల దొంగలు అరెస్ట్

కొండాపురం, అక్టోబరు 1: బెడుదూరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో పంచలోహ విగ్రహాల చోరీ కేసులో 48 గంటల్లోనే ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం తెల్లవారు జామున ఆలయంలోని వేంకటేశ్వరస్వామి, భూదేవి, శ్రీదేవి విగ్రహాలు చోరీకి గురైన సంగతి తెలిసిందే. ఇదే గ్రామానికి చెందిన తండ్రీ కొడుకులు వెంకటరమణ, రాజు, కొత్తపల్లె వాసి వెంకటసుబ్బయ్య కలిసి చోరీకి పాల్పడినట్లు సీఐ మహమ్మద్‌రఫీ, తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ హృషికేశ్వరరెడ్డి తెలిపారు. విగ్రహాలను తీసుకెళుతుండగా మంగళవారం ఉదయం బెడుదూరు క్రాస్ వద్ద అరెస్టు చేసినట్లు తెలిపారు. వీరిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

వీరబల్లి, అక్టోబరు1: రాయచోటి- వీరబల్లి ప్రధాన రహదారిలోని నీలంవాండ్లపల్లె వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పిచ్చికుంటపల్లి వాసి రాఘవులుకు తీవ్రగాయాలైనట్లు ఎస్ఐ మోహన్‌నాయక్ తెలిపారు. రాయచోటి మోడల్ స్కూల్‌లో చదివే ముగ్గురు విద్యార్థులు బైక్‌పై వస్తుండగా రాయచోటి నుంచి ఆటోలో వచ్చి దిగి పిచ్చికుంటపల్లికి వెళుతున్న నీలంవాండ్లపల్లి వాసి రాఘవులును ఢీన్నారు. ప్రమాదంలో రాఘవులు రెండు కాళ్లు విరిగి గాయాలయ్యాయన్నారు. ప్రమాద సంఘటనపై కేసు నమోదు చేసి తీవ్రంగా గాయపడిన రాఘవులను చికిత్స నిమిత్తం రాయచోటి ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యపానంపై ముమ్మరదాడులు

గణాంకాలు విడుదల చేసిన ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

కడప (క్రైం), అక్టోబరు 1: పోలీసుశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో గత నెలలో పలు నేరాలపై ముమ్మరంగా దాడులు చేసి కేసులు నమోదు చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. బహిరంగప్రదేశాల్లో మద్యపానం, గంజాయి విక్రయాలు, గ్యాంబ్లింగ్, మట్కా నిర్వహకులపై దాడులు, ఇసుక అక్రమ రవాణా, అక్రమ మద్యంపై దాడులు నిర్వహించారు. గత నెలలో పోలీసుశాఖ పనితీరుపై గణాంకాలను మంగళవారం ఎస్పీ విడుదల చేశారు. మద్యపానం చేసే ప్రదేశాలను గుర్తించి మునిసిపల్, పంచాయతీ అధికారుల సమన్వయంతో అక్కడ మొక్కలు, పొదలను క్లీన్ చేయించారు. హెల్మెట్‌రహిత డ్రైవింగ్ చేసే 4188 మందిపై ఎంవీ యాక్ట్ కేసులు నమోదు చేసి మొత్తం రూ.5,65,380 జరిమానా విధించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న వారిపై దాడులు చేసి నెలరోజుల్లో 1525 మందిపై కేసులు నమోదు చేశారు. గంజాయి విక్రయాలపై దాడులు నిర్వహించి 28.37 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని 16 కేసులు నమోదు చేసి 41 మందిని అరెస్టు చేశారు. గ్యాంబ్లింగ్‌పై 62 కేసుల్లో 382 మంది జూదర్లను అరెస్టు చేసి రూ.11,41,920 నగదు, 9 మంది కోడిపందెం గాళ్లను అరెస్టు చేసి రూ.9,200 నగదు సీజ్ చేశారు. మట్కా నిర్వహకులపై 42 కేసుల్లో 67 మంది అరెస్టు, రూ.5.96 లక్షలు నగదు సీజ్ చేశారు. ఇసుక అక్రమ రవాణాదారులను 145 మందిని పట్టుకుని అరెస్టు చేసి 68 కేసులు నమోదు చేసి 472 టన్నుల ఇసుక, 114 వాహనాలు సీజ్ చేశారు. అక్రమ మద్యంపై పోలీసులు దాడులు చేసి 204.75 లీటర్ల అక్రమ మద్యం స్వాధీనం చేసుకుని 37 కేసుల్లో 37 మందిని అరెస్టు చేశారు. సెప్టెంబరులో జిల్లా వ్యాప్తంగా 141 కేసుల్లో 581 మందిని బైండోవర్ చేశారు. జిల్లాలో 144 మంది రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ చేశారు.

ఫ్రీహోల్డ్ భూముల పరిశీలన పక్కాగా ఉండాలి

రాష్ట్ర సమీక్షలో రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్

రాయచోటి (కలెక్టరేట్) అక్టోబరు 1: ఫ్రీహోల్డ్ భూముల పరిశీలన పకడ్బందిగా నిర్వహించాలని రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. మంగళవారం సీసీఎల్ఏ కార్యలయం నుంచి ఫ్రీహోల్డ్ భూములపై సమీక్షించారు. భూముల రిజిస్ట్రేషన్లు నిబంధనల ప్రకారం జరిగాయా లేదా అన్న విషయాలను క్షేత్రాస్థాయిలో పరిశీలించాలని కలెక్టర్లకు సూచించారు. అనంతరం అన్నమయ్య జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఫ్రీహోల్డ్ అయిన భూముల పరిశీలన ప్రక్రియ సజావుగా సాగేందుకు స్పష్టమైన మార్గాదర్శకాలు జారీ చేసిందన్నారు. రీ వెరిఫికేషన్ చట్టబద్ధంగా నిబంధనల మేరకు పక్కాగా చేయాలన్నారు. చెక్‌లిస్టు ప్రకారం ప్రతి విషయాన్ని క్షుణంగా పరిశీలించాలన్నారు. చట్ట ప్రకారం, నిబంధనలకు లోబడి పక్కగా పరిశీలన పూర్తి చేసిన నిర్దేశిత నమూనాలో పూర్తి స్థాయిలో నివేదికలు సమర్పించాలన్నారు. రీ వెరిఫికేషన్‌లలో అప్పగించిన విధులను నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలుంటాయిని హెచ్చరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డీఆర్ఓ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగాల పరిశీలన



గోపనపల్లెలో పంటకోత ప్రయోగం చేస్తున్న వ్యవసాయ అధికారులు

గాలివీడు, అక్టోబరు1: మండలంలోని గోపగుడిపల్లె గ్రామంలో జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్ వేరుశనగ పంటకోత ప్రయోగాలను పరిశీలించారు. మంగళవారం మండలంలో పర్యటించిన ఆయన పంట కోత ప్రయోగాలను తనిఖీ చేసి దిగుబడిని లెక్కించారు. పందికుంట గ్రామంలోని రైతు సేవా కేంద్రం పరిధిలో ఈ పంట నమోదు జాబితాలో కొన్ని రికార్డులను పరిశీలించారు. అనంతరం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి మురళీధర్, జేడీఎస్ కార్యాలయ టెక్నికల్ ఏఈవోలు వెంకటమోహన్, రమేశ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ రాష్ట్ర కార్యదర్శిగా గంటా నరహరి



రాజంపేట టౌన్, అక్టోబరు 1 : వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శిగా గంటా నరహరిని నియమిస్తూ వైసీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి, వైసీ పీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తనను రాష్ట్ర కార్యదర్శిగా నియమించడం ఆనందంగా ఉందన్నారు. పార్టీ అధ్యక్షుడి ఆదేశాల మేరకు పార్టీ పటిష్టతకు తన శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. తన నియామకంలో కీలకపాత్ర పోషించిన నేతలకు కృతజ్ఞతలు తెలిపారు.

బొప్పాయి రైతుల సమస్యలపై 5న సమావేశం



కలెక్టర్‌కు సమస్యలు వివరిస్తున్న సీఐటీయూ, రైతు సంఘం నాయకులు

రైల్వేకోడూరు(రూరల్) అక్టోబరు 1: బొప్పాయి రైతుల సమస్యలపై జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో ఈ నెల 5న రైల్వేకోడూరు పట్టణంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా సీఐటీయూ అధ్యక్షుడు సి.హెచ్.చంద్రశేఖర్ తెలిపారు. బొప్పాయి రైతుల సమస్యలపై స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేయడంతో స్పందించిన కలెక్టర్ జాయింట్ కలెక్టర్‌ను ఆదేశించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో నియోజకవర్గంలోని బొప్పాయి రైతులందరూ పాల్గొని తమ సమస్యలను అధికారులకు వివరించాలని కోరారు.


వరద బాధితుల కోసం విద్యార్థుల విరాళాల సేకరణ



ఎంఈవోకు చెక్కును అందజేస్తున్న విద్యార్థులు

పుల్లంపేట, అక్టోబరు 1 : విజయవాడ వరద బాధితుల కోసం పుల్లంపేటలోని ప్రత్యూష హైస్కూల్ విద్యార్థులు విరాళాల ద్వారా 52 వేల రూపాయలను సేకరించారు. ఈ డబ్బును సీఎం రిలీఫ్‌ఫండ్ పేరుతో చెక్కు తీసి మంగళవారం ఎంఈవో చక్రధర్‌రాజుకు అందజేశారు. ఈ సందర్భంగా విరాళాలు సేకరించిన విద్యార్థులను ఎంఈవో అభినందించారు. ప్రిన్సిపాల్ రాజశేఖర్, హెచ్ఎం నరసింహులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వెయ్యి అడుగుల మహాత్మాగాంధీ చిత్రం



రామాపురం,అక్టోబరు1: గాంధీ జయంతి సందర్భంగా మండలంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురు కుల పాఠశాల ఆర్ట్ మాస్టర్ ఆనంద్‌రాజు వెయ్యి అడుగు ల మహాత్మాగాంధీ చిత్రాన్ని తయారు చేశారు. ఈ చిత్రం ప్రపంచ రికార్డు సృష్టిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

తాగునీటి సమస్య పరిష్కారం మా బాధ్యత

● మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



తాగునీటి బోరును ప్రారంభించిన మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

సంబేపల్లె, అక్టోబరు1: రాయచోటి నియోజకవర్గంలోని ప్రజల దాహం తీర్చడం తమ బాధ్యతని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. మంగళవారం సంబేపల్లె మండలం రెడ్డివారిపల్లె, సీఎం కొత్తపల్లి, దేవపట్ల, కట్టుగుత్తపల్లెలో వేసిన బోర్లను ఆయన ప్రారంభించారు. ప్రస్తుతం గ్రామాల్లో తాగునీటి సమస్యను స్థానిక నాయకులు తమ దృష్టికి తేవడంతో బోర్లు వేయించామన్నారు. గతంలో ఉన్న నీటి పథకం బోర్లు అడుగంటిపోవడంతో ఈ ఏడాది వేసవి రాకముందే పల్లెల్లో నీటి ఎద్దడి మొదలైంద న్నారు. బోర్లు ఫెయిలైన చోట ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేసి ప్రజల దాహం తీరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మల్లు నరసారెడ్డి, యువగళం సభ్యులు మండిపల్లి సిద్దారెడ్డి, ఎంపీడీవో సునీల్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ మహేశ్వరి, భయ్యారెడ్డి, నూరెకరాల రంగారెడ్డి, కిరన్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, రామచంద్ర, వెంకటేశ్వర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రుడికి పూజలు

పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామిని మంగళవారం ఉదయం రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా దేవదాయ శాఖ జిల్లా అధికారి విశ్వనాథ్, ఆలయ ఈవో డీవీ కొండారెడ్డి, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వీరభద్రస్వామిని, భద్రకాళి అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ మండపంలో అర్చకులు తీర్థప్రసాదాలు అందించి, ఆశీర్వచనం చేశారు. జిల్లా దేవాదాయశాఖ అధికారి, ఆలయ ఈవో దసరా ఉత్సవాల ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తమ ఉద్యోగాల రెగ్యులరైజేషన్ అంశాన్ని ఆలయంలో పనిచేస్తున్న అర్చకులు, సిబ్బంది మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గంలో ఉన్న ఆలయంలో ధూప, దీప నైవేద్యం, శ్రీవాణి ట్రస్టు నిధుల కింద ఉన్న దేవాలయాల వివరాలు, సర్వశ్రేయోనిధి ద్వారా జరిగే అభివృద్ధి పనులు, దేవాలయాల ఆస్తులు, వాటి స్థితిగతుల వివరాలను జిల్లా దేవాదాయశాఖ అధికారి మంత్రికి వివరించారు. వీరభద్రస్వామి గుడి ఎదురుగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ కారణంగా సమస్యలు ఏర్పడుతున్నట్లు ఆలయ ఈవో మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా, ప్రైవేటు కళాశాలల అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ పీ. మదన్‌మోహన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వాసుబాబు, అర్చకులు, ఆలయ సిబ్బంది, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహనీయుని బాటలో మనమంతా

మహాత్మాగాంధీ స్వాతంత్ర ఉదమాన్ని ముందుండి నడిపించడమే కాకుండా స్వాతంత్ర్య సమరయోధులు అందరినీ ఏకతాటిపైకి తీసుకొచ్చాడని అటువంటి మహనీయుని బాటలో మనమంతా కలిసి నడవాలని, సేవాభావంతో ప్రజలకు తన మన బేధాలు లేకుండా సేవ చేయడమే మహాత్మాగాంధీ ఘనమైన నివాళి అని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మీడియాకు తెలిపారు. మహ నీయుని బాటలోనే సీఎం చంద్రబాబునాయుడు గ్రామ గ్రామాల్లో ప్రజలకు సంక్షేమ అభివృద్ధి ఫలాలు అందజేస్తూ ఇదే మంచి ప్రభుత్వం అనే దిశగా కృషి చేస్తున్నారని మంత్రి తెలిపారు.

విశాఖ స్టీల్ ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలి

● కలెక్టర్ కార్యాలయం వద్ద విద్యార్థి సంఘాల రిలే దీక్ష



కలెక్టర్ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్షలు చేస్తున్న విద్యార్థి సంఘాలు

రాయచోటి (కలెక్టరేట్) అక్టోబరు 1: విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకి గనులు కేటాయించాలని, సెయిల్‌లో విలీనం చేయాలని కోరుతూ విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో రిలే మంగళవారం నిరాహార దీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సీపీఐ కార్యదర్శి నరసింహులు, ఏఐవైఫ్ కార్యదర్శి వెంకటేష్ మాట్లా డుతూ 32 మంది విద్యార్థులు, వేలాది మంది రైతుల త్యాగం, వామపక్ష ఎమ్మెల్యేల రాజీనామాలతో సాధించుకున్న విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ యత్నాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్నామన్న పవన్ కళ్యాణ్ అధికారంలోనికి రాగానే నష్టాలు వస్తే ఎన్నిరోజులు భరిస్తారని మాట మార్చడం ఎంత వరకు సమంజసమని వారు ప్రశ్నించారు. విశాఖ ఉక్కును సెయిల్‌లో కలుపుతామని ప్రకటన చేస్తూనే, రాత్రికి రాత్రే 4 వేల మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను తొలగించడం దేనికి సంకేతం అని ప్రశ్నించారు. వెంటనే విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించి, ఈ ఫ్యాక్టరీని ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ సభ్యుడు కోటేశ్వరరావు, లవకుమార్, ప్రశాంత్, బాలసుబ్రహ్మణ్యం, గురునాథ్, సతీష్, అశోక్, చందు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక గ్రామ సభను జయప్రదం చేయండి: డీఎల్‌పీవో

లక్కిరెడ్డిపల్లె, అక్టోబరు 1: స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో బుధవారం నిర్వహించనున్న ప్రత్యేక గ్రామ సభను జయప్రదం చేయాలని డీఎల్‌పీఓ పార్వతి కోరారు. మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రజా ప్రణాళిక ఉద్యమం 2024-25 సబ్ కీ యోజన సబ్‌కా వికాస్, పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక ప్రత్యేక గ్రామ సభను జయప్రదం చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రోడ్డు రవాణా,యువజన క్రీడల శాఖ మంత్రి మండిపల్లె రామ్‌ప్రసాద్ రెడ్డి, కలెక్టర్ చామకూరి శ్రీధర్, డీపీవో ధనలక్ష్మి, హాజరు కానున్నారని తెలిపారు. గ్రామ .పంచాయతీ పరిధిలో 75 ఏళ్ల వృద్ధులను 100 మందిని గుర్తించాలని, పంచాయతీ పరిస్థితులు కార్యదర్శులు, గ్రామ సమస్యలు, గ్రామాల అభివృద్ధి పక్కా ప్రణాళికతో హాజరుకావాలన్నారు. ఎంపీడీవో వెంకటరామిరెడ్డి, ఈఓపీఆర్‌డీ పట్నాయక్, పంచాయతీ కార్యదర్శులు సుదర్శన్ రెడ్డి, హిమామ్‌బాషా, ఇస్మాయిల్, జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిపై డీఈవోకు ఫిర్యాదు



పాఠశాలకు వేసిన తాళాన్ని పరిశీలిస్తున్న ఎంఆర్‌పీలు

గాలివీడు, అక్టోబరు 1: విధులకు డుమ్మా కొట్టిన ఉపాధ్యాయుడు బీ. వెంకటేశ్వర్లుపై జిల్లా విద్యాధికారికి ఫిర్యాదు చేసినట్లు ఎంఈవో పిల్లి నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలివీడు మండలం అరవీడు గ్రామం గాండ్లపల్లి ఎంపీపీ పాఠశాలలో ఎస్జీటీగా విధులు నిర్వహిస్తున్న బీ. వెంకటేశ్వర్లు తరచూ పాఠశాలకు గైర్హాజరు కావడంపై విద్యార్థుల తల్లిదండ్రులు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేయడంతో పాఠశాలను సందర్శించి విచారించగా ఉపాధ్యాయుడిపై వచ్చిన ఆరోపణలు వాస్తవమేనని తేలిందన్నారు. తూముకుంటలో విధులు నిర్వహిస్తున్నపుడు కూడా తోటి ఉపాధ్యాయులతో గొడవపడేవారన్నారు. వీలున్నప్పుడు పాఠశాలకు రావడం, ఓ గంట కాలక్షేపం చేసి పాఠశాలకు తాళాలు వేసుకుని వెళ్లిపోవడం పరిపాటిగా మారిపోయిందన్నారు. ప్రశ్నించిన తల్లిదండ్రులు, విద్యార్థులను దూషించేవాడని స్థానికులు ఎంఈవో దృష్టికి తీసుకువచ్చారు. మంగళవారం ఉదయం 9 గంటలకు పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయుడు మునుపటిలాగే తల్లిదండ్రులతో గొడవపడి పాఠశాలకు తాళాలు వేసుకుని వెళ్లిపోయాడు. జరిగిన వాస్తవాలను నివేదిక రూపంలో జిల్లా విద్యాశాఖ అధికారులకు పంపినట్లు ఎంఈవో తెలిపారు.

విజేతలకు బహుమతి ప్రదానం

లక్కిరెడ్డిపల్లె, అక్టోబరు 1: ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం ఇంట్లోని వంట గదిలో దొరికే పదార్థాలు, ఔషధ మొక్కల ఉపయోగాలపై పోటీ నిర్వహించారు. ఈ పోటీల్లో సీనియర్ విభాగంలో అమరేంద్రబాబు, తాజ్‌వలి, ఫరీద్‌బాషా, జూనియర్ విభాగంలో మౌలాలి, అర్షద్, భరత్ చక్రి విజేతలుగా నిలిచారు. ఏకలవ్య ఫౌండేషన్ కోఆర్డినేటర్ శ్రీనివాసులు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వరులు పాల్గొన్నారు.

ప్రేమాలయంను సందర్శించిన జడ్జి



వృద్ధాశ్రమంలో జడ్జి ఫైజున్నీసా

రామాపురం, అక్టోబరు 1: మండల పరిధిలోని ప్రేమాలయం వృద్ధాశ్రమాన్ని లక్కిరెడ్డిపల్లె జూనియర్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఫైజున్నీసా మంగళవారం సందర్శించారు. వృద్ధుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వారిని ప్రేమానురాగాలతో చూసుకోవాలని అక్కడ పని చేస్తున్న సిబ్బందిక సూచించారు. రామాపురం పోలీసులు పాల్గొన్నారు.

కసిరెడ్డికుంట ఆక్రమణలు అరికట్టండి



కసిరెడ్డి కుంటను కబ్జా చేసిన స్థలాన్ని పరిశీలిస్తున్న సీపీఐ నేతలు

రామాపురం, అక్టోబరు1: కసిరెడ్డి కుంటను కబ్జా చేసి, అందులోని మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని సీపీఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు ఆరోపించారు. మంగళ వారం హసనాపురం గ్రామ పరిధిలో కబ్జాకు గురైన కసిరెడ్డికుంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ 1062, 1063 సర్వే నెంబర్లలోని 9.70 ఎకరాల కసిరెడ్డికుంటను రాజకీయ పలుకుబడి కలిగిన వ్యక్తులు కబ్జా చేశారన్నారు. కబ్జాదారుల నుండి చెరువులను, కుంటలను కాపాడని పక్షంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు జగన్, ఆంజనేయులు, బాబ్జాన్ తదితరులు పాల్గొన్నారు.

జోనల్ స్థాయి కబడ్డీ పోటీలకు హారిక



జోనల్‌స్థాయికి ఎంపికైన హారిక

రాజంపేట టౌన్, అక్టోబరు 1 : బాలికల కబడ్డీ పోటీల్లో రాజంపేట మం డలం ఊటుకూరు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఉద్దండపు హారిక జోనల్ స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుహాసిని మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో నిర్వహించిన అండర్-17 జిల్లా స్థాయి బాలికల కబడ్డీ పోటీల్లో ప్రతిభ చూపిన ఆమె జోనల్ స్థాయికి ఎంపికైంది. జోనల్ స్థాయిలో ప్రతిభ చూపి తమ పాఠశాలకు, తమ ప్రాంతానికి కూడా కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని కోరారు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు నాగరాజరెడ్డి, ఉపాధ్యాయ బృందం హారికకు అభినందనలు తెలియజేశారు.

దుకాణాల ముందు వాహనాలు నిలిపితే చర్యలు

గాలివీడు, అక్టోబరు1: రహదారులపై వాహనాలు అడ్డుగా ఉంచి ట్రాఫిక్‌కు అంత రాయం కలిగించవద్దని లక్కిరెడ్డిపల్లె సీఐ వెంకట కొండారెడ్డి సూచించారు. మంగళవారం గాలివీడు బస్టాండు నుంచి గేటు వరకు రహదారులపై అడ్డుగా ఉన్న వాహనాలను తొలగించారు. దుకాణాలు, నివాసాల ముందు రోడ్డుపై వాహనాలు పార్కింగ్ చేయరాదన్నారు. పరిమితికి మించి ప్రయాణికులతో ఆటోలు నడపరా దన్నారు. దసరా సందర్భంగా ఊర్లకు వెళ్లే వారు ఇళ్లలో విలువైన వస్తువు లు, నగదు ఉంచరాదన్నారు. ఏఎస్ఐ అంజిరెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

'చెకుముకి' విజేతలకు బహుమతి ప్రదానం

నందలూరు, అక్టోబరు 1 : సమగ్ర శిక్ష అభియాన్, జనవిజ్ఞానవేదిక సంయుక్త నిర్వహణలో నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహిం చారు. ఈ పోటీల్లో మొత్తం 15 టీములు పాల్గొనగా, ప్రభుత్వ పాఠశాల విభాగంలో జ్యోతిబాఫూలే బీసీ బాలికలు గురుకుల పాఠశాల, పాటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు తొలి మూడు స్థానాల్లో నిలిచారు. ప్రైవేటు పాఠశాలల విభాగంలో సెయింట్ జోసెఫ్ పాఠశాల మొదటి, అక్షర గొబ్బిళ్ల పాఠశాల రెండవ, ఆడపూరు సాయివిద్యానికేతన్ పాఠశాల విద్యార్థులు మూడో స్థానంలో నిలిచి నట్లు జనవిజ్ఞాన వేదిక అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు షేక్ రౌఫ్‌బాషా, మండలశాఖ అధ్యక్షుడు జి.కృపానందం తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు సర్టిఫికెట్, మెడల్స్, జ్ఞాపికలను హెచ్ఎం ఎన్.శ్రీనివాసులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మనోహర్, ఎ.వరప్రసాద్, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

వీరబల్లి: . వీరబల్లి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన చెకుముకి టాలెంట్ టెస్టులో ప్రథమ స్థానంలో వీరబల్లి ఉన్నతపాఠశాల, ద్వితీయ స్థానంలో పేరయ్యగారిపల్లె ఉన్నత పాఠశాల, తృతీయ స్థానంలో చమర్తివాండ్లపల్లె పాఠశాల నిలిచాయి. ఎంపీడీవో మల్లీశ్వరి జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా అసోసియేట్ సైన్సు ఆఫీసర్ పల్లం రామచంద్ర, ఇన్‌చార్జి హెచ్ఎం రెడ్డెయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అనంతరం ఎంపీడీవో మల్లీశ్వరి మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. మెనూ అమలుపై విద్యార్థులను ఆరా తీశారు.

పుల్లంపేట: స్థానిక బీపీ శేషయ్య సంస్కృత ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన చెకుముకి టాలెంట్ టెస్టులో ప్రత్యూష హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపి మొదటి స్థానంలో నిలిచినట్లు ఎంఈవో చక్రధర్‌రాజు తెలిపారు. రెండోస్థానంలో శాంతినికేతన్ హైస్కూల్, మూడో స్థానంలో శివపార్వతి హైస్కూల్ విద్యార్థులు నిలిచారన్నారు. గెలుపొందిన విద్యార్థులకు ఎంఈవో బహుమతులను అందజేశారు.

ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఇంటింటికి పింఛన్ పంపిణీ



పింఛన్ పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే అరవ శ్రీధర్

రైల్వేకోడూరు(రూరల్) అక్టోబరు 1: ఇది పేదల ప్రభుత్వమని రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వృద్ధులకు, వితంతులకు ఇచ్చి న హామీ మేరకు ప్రతి నెల ఒకటిన ఇంటింటికి పింఛన్ పంపించి పేదల కళ్లల్లో ఆనందం చూస్తున్నారని కొనియాడారు. మంగళవారం పట్టణంలో ఇంటింటికి పింఛన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సకాలంలో పింఛన్ పొందని వృద్ధులకు రేపు పింఛన్ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోడూరు మాజీ ఉపసర్పంచ్ నార్జల హేమరాజ్, మైనారిటీ నాయకులు పఠాన్ మౌలా, టీడీపీ యువ నాయకులు పోతురాజు సుమన్ మరియు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె : మండలంలోని మంగళంపల్లె, కాకర్లవారిపల్లెలో టీడీపీ నాయకుడు శివయ్యనాయుడు, మండల కేంద్రంలో పున్నాటి వాసుదేవరెడ్డి, కటికంవారిపల్లెలో సునీత, నాగరాజు సామాజిక పింఛన్లు పంపిణీ చేశారు.

శ్మశాన వాటిక ఆక్రమిస్తున్నారని ఫిర్యాదు

సుండుపల్లె, అక్టోబరు 1: మండల కేంద్రంలోని శ్మశానవాటిక ఆక్రమ ణకు కొందరు యత్నిస్తున్నారని గుల్లావాండ్లపల్లి గ్రామస్తులు మం గళ వారం రెవెన్యూ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ చంద్ర శేఖర్‌కు వినతి పత్రాన్ని అంద జేశారు. అనంతరం పోలీస్‌స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబుకు సమస్యను వివరించారు. దీంతో తహసీల్దార్ ధైవాదీనం, డిప్యూటీ తహసీల్దార్ రెడ్డెన్న మంగళవారం సాయంత్రం స్థలాన్ని పరిశీలించి విచారణ చేశారు. శ్మశాన వాటిక స్థలం అన్యాక్రాంతం కాకుండా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌వో బాషా తదితరులు పాల్గొన్నారు.

సౌమ్యనాథాలయ హుండీ లెక్కింపు

నందలూరు, అక్టోబరు 1: స్థానిక సౌమ్యనాథస్వామి ఆలయం హుండీలోని కానుకలను సోమవారం ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్ ఆధ్వర్యంలో లెక్కించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకనెలకు సంబంధించిన కానుకలను లెక్కించగా 1,73,175 రూపాయలు వచ్చినట్లు తెలిపారు. ఈ మొత్తాన్ని ఆలయానికి సంబంధించిన బ్యాంకు ఖాతాలో జమ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ హనుమంతయ్య, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మహాత్మా గాంధీకి ముందస్తు నివాళి

రాజంపేట, అక్టోబరు 1: గాంధీజీ జయంతిని పురస్కరించుకుని మంగళవారం రాజంపేట అన్నమాచార్య యూనివర్సిటీ టచ్‌స్టోన్ విభాగం విద్యార్థులు మహాత్ముని జీవన విధానం ఆయన ఆలోచనలు, శాంతియుత మార్గంలో స్వాతంత్ర్య పోరాటం అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో సి.వెంకటదీప్తి ప్రథమ బహుమతిని, ఐ.మధువాణి ద్వితీయ బహుమతిని, ఆర్.షాదియా తృతీయ బహుమతులను గెలుచుకున్నారు. వీరికి కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎంవీ నారాయణ, వైస్‌ఛైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి బహుమతి ప్రదానం చేశారు.

రైల్వేకోడూరు(రూరల్): బుడుగుంటపల్లె పంచాయతీలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘననివాళి అర్పించారు.

పెనగలూరు: చక్రంపేట ఉన్నత పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులు ఉపాధ్యాయులతో కలిసి ప్రధానోపాధ్యాయుడు లేబాకు గోపాలకృష్ణ జాతిపిత మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

ప్రకృతి వ్యవసాయంతో పర్యావరణ పరిరక్షణ

రైల్వేకోడూరు(రూరల్) అక్టోబరు, 1: ప్రకృతి వ్యవసాయం ద్వారా పర్యావరణాన్ని కాపాడుతూ అధిక దిగుబడులు పొందవచ్చని మండల వ్యవసాయ అధికారి సుధాకర్ తెలిపారు. మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని కే.బుడుగుంటపల్లె , కంద్రిగలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉద్యానశాఖ అధికారి భాస్కర్ ప్రభుత్వ పథకాలనువివరించారు. వ్యవసాయ మార్కెటింగ్ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

జీవన ఎరువులపై రైతులకు అవగాహన

ఓబులవారిపల్లె, అక్టోబరు 1 : పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళ వారం చిన్నఓరం పాడు, ఓబులవారిపల్లె పం చాయతీల్లో తమలపాకు, అరటి, రైతులకు వ్యవసా యాధికారి మల్లిక సూచనలు, సలహాలు అందజేశా రు. పాఠశాల ప్రాంగణంలో జీవన ఎరువులు, జీవన శిలీంద్రనాశిని వినియోగంపై రైతులకు వివరించారు. అగ్రికల్చర్ అసిస్టెంట్ పశువైద్యాధికారి, ప్రకృతి వ్యవసాయ శిక్షకులు బుల్లయ్య, సహదేవ, నాగేంద్ర, సిబ్బంది మధు, మాజీ ఎంపీటీసీ రవీంద్ర నాయుడు, పయ్యావుల కోటేశ్వరరావు, కంచర్ల శ్రీనివాసులునాయుడు, సుబ్బా నాయుడు, సుబ్రమణ్యం నాయుడు పాల్గొన్నారు.

ముందస్తు దసరా ఉత్సవాలు

రాజంపేట, అక్టోబరు 1 : పట్టణంలోని చెర్రీస్ ఉన్నత పాఠశాలలో మంగళవారం దసరా ఉత్సవాలను ఆ పాఠశాల అధినేతలు ప్రేమలత, వెంకటేశ్వర్‌రెడ్డి, సీపీవో రంగ ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈవో రఘురామరాజు మాట్లాడుతూ పండుగలు మన సంస్కృతి సంప్రదాయాలకు దీపికలు లాంటివన్నారు. ప్రధానంగా విద్యార్థులు పండుగల ప్రాధాన్యతను తెలుసుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ దేవతామూర్తుల అలంకరణలో స్థానికులను ఆకట్టుకున్నారు

చదువుతో పాటు ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవాలి

రాయచోటిటౌన్, అక్టోబరు1: విద్యార్థులు చదువుతో పాటు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవడమే కాకుండా నివాసాల చుట్టుపక్కల వారికి కూడా ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కొండయ్య సూచించారు. వరల్డ్ రేబిస్ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక బోస్‌నగర్‌లోని నారాయణ పాఠశాలలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది, ప్రసాద్‌యాదవ్, విజయ, బలరామరాజు, సరళమ్మ, నూర్జహాన్, పాఠశాల ఏజీఎం శంకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ఖాదర్‌వలి పాల్గొన్నారు.

రన్నింగ్ రూంలో వసతులను మెరుగుపరచాలి

నందలూరు, అక్టోబరు 1: రైల్వేకేంద్రంలోని రన్నింగ్ రూంలో వసతులు మెరుగు పరచాలని రైల్వే గుంతకల్ డివిజన్ ఏడీఆర్ఎం సుధాకర్ ఆదేశించారు. మంగళవారం సాయంత్రం నందలూరు రైల్వే కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేపట్టిన ఆయనకు పలువురు ఉద్యోగులు రన్నింగ్ రూములోని సమస్యలను ఏకరువుపెట్టారు. అనంతరం రైల్వేగ్రంథాలయంలో లోకో పైలట్‌లు, అసిస్టెంట్ లోకోపైలట్‌లు, ట్రైన్ మేనేజర్‌లు, ఇతర సిబ్బందితో సమావేశం నిర్వహించి పలు సలహాలు, సూచనలు అందజేశారు. స్టేషన్ మేనేజర్ కమలాకర్, అధికారులు పాల్గొన్నారు.

మగ్గం వర్క్, జ్యూట్ బ్యాగుల తయారీలో శిక్షణ

రైల్వేకోడూరు(రూరల్) సెప్టెంబరు 25: మగ్గం వర్క్, జ్యూట్ బ్యాగుల తయారీపై గ్లోబల్ సర్వీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ఛైర్మన్ కె.పార్థసారథి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మగ్గం వర్క్‌పై 30 రోజులు జ్యూట్ బ్యాగుల తయారీపై 15 రోజుల శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల 18 నుండి 45 ఏళ్లలోపు మహిళలు ఆధార్ కార్డు, నాలుగు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, విద్యార్హత సర్టిఫికెట్లతో గ్లోబల్ సర్వీస్ ట్రస్ట్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఉల్లాసంగా ఉత్సాహంగా ఫ్రెషర్స్‌డే

పెనగలూరు, అక్టోబరు 1 :మండల కేంద్రంలోని ఏపీ ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ సహజ బ్లెస్సీ అధ్యక్షతన మంగళవారం ఫ్రెషర్స్‌డే నిర్వహించారు. అన్ని తరగతుల విద్యార్థులు ఆటల పోటీల్లో పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విజేతలకు పాఠశాల యాజమాన్యం బహుమతులు అందజేసింది. మధ్యాహ్నం విద్యార్థిని విద్యార్థులందరికి భోజనం అందించారు.

సబ్సిడీ ఉలవలను సద్వినియోగం చేసుకోవాలి

లక్కిరెడ్డిపల్లె అక్టోబరు 1: సబ్సిడీపై ప్రభుత్వం ఇస్తున్న ఉలవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీటీసీ మాజీ సభ్యుడు యనమల మదన్‌మోహన్ తెలిపారు. మంగళవారం లక్కిరెడ్డిపల్లెలోని ఆర్‌బీకేలో రైతులకు ఉలవలు పంపిణీ చేశారు. మండలానికి 445 క్వింటాళ్ల ఉలవలు మంజూరయ్యాయని ఏఓ రమేష్‌బాబురావు తెలిపారు. ప్రతి రైతు ఈ క్రాప్ బుకింగ్ చేయించు కోవాలన్నారు. రాజంపేట పార్లమెంట్ డాక్టర్ల సంఘం ప్రధాన కార్యదర్శి షఫీనాయక్, బీజేపీ నాయకులు కొండూరు వెంకటరామరాజు, ముక్తార్, అన్వర్, ఎంఈఓలు రైతులు పాల్గొన్నారు

ఆలయాల జీర్ణోద్ధరణకు కృషి

రామాపురం, అక్టోబరు 1: ఆలయాల జీర్ణోద్ధరణకు అన్ని విధాలా కృషి చేస్తామని ఉమ్మడి కడప జిల్లా దేవదా యశాఖ అధికారి విశ్వనాథ్ తెలిపారు. మంగళవారం మండలంలోని హసనాపురం గ్రామంలో పలు దేవాలయాలను ఆయన సందర్శించారు. దేవాలయాలు అభివృద్ధికి నోచుకోలేదని ఆలయ భూములు అన్యాక్రాంతం కావడంతోపాటు, నిధులు దుర్వినియోగమయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఇరుగులమ్మ ఆలయ ధర్మకర్తగా ఉన్న వ్యక్తి దేవాలయం కట్టించినట్లు బిల్లులు చేసుకున్నాడని, హసనాపురం కస్బాలో ఉన్న వెంకటేశ్వరస్వామి దేవాలయం అభివృద్ధి పనులు నిలిపేశారని, దీంతో ఆలయంలో పిచ్చిమొక్కలు మొలిచాయన్నారు. పప్పిరెడ్డిగారిపల్లెలో ఉన్న దేవాలయం పరిస్థితి కూడా అలాగే ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.




పేలుడుతో తలకిందులైన కారు - క్లెమోర్ మైన్‌లో వాడిన ఇనుప గోళాలు (ఇన్‌సెట్‌లో)





ధ్వంసమైన చంద్రబాబు కారు





విస్ఫోటనం తీవ్రతకు తెగిపడ్డ తీగలు - పేల్చడానికి వాడిన ఫ్లాష్ (ఇన్‌సెట్‌లో)

అలిపిరిలో ఆ క్షణం

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

చంద్రబాబుపై క్లెమోర్‌మైన్ దాడి జరిగి 21 ఏళ్లు

2003 అక్టోబరు1, సాయంత్రం 4.05 గంటలు..

అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు తిరుమలేశుడికి పట్టువస్త్రాలు సమర్పించేందుకు తిరుమలకు బయలుదేరారు. అలిపిరి టోల్‌గేట్ దాటగానే భారీ పేలుడు.. ముఖ్యమంత్రి ప్రయాణిస్తున్న బులెట్ ప్రూఫ్ కారు ఆకాశంలోకి ఎగిరి పడింది. క్లెమోర్ మైన్స్‌తో అప్పటి పీపుల్స్‌వార్ నక్సలైట్లు చేసిన దాడి అది. కారులో చంద్రబాబుతో పాటూ అప్పటి మంత్రి బొజ్జల గోపాల కృష్ణారెడ్డి, ఎమ్మెల్యేలు చదలవాడ కృష్ణమూర్తి, రెడ్డివారి రాజశేఖర రెడ్డి కూడా ఉన్నారు. అంత భారీ పేలుడులోంచి చంద్రబాబు సహా అందరూ గాయాలతో బయటపడడం విచిత్రం. ఆ దేవదేవుడి కరుణగా ఇప్పటికీ చెప్పుకుంటారు. అలిపిరి సంఘటనలో బాధితులూ, ప్రత్యక్ష సాక్ష్యుల 21 ఏళ్ల కిందటి జ్ఞాపకాలు ఇవి...

ఆ శబ్దం ఇప్పటికీ చెవుల్లో మోగుతోంది

పుత్తూరు అభివృద్ధి కోసం రూ.300కోట్లు కావాలని కోరుతూ ఒక ప్రణాళిక తయారు చేసుకున్నా. దానిని సీఎం చంద్రబాబుకు వివరించాలి. తిరుపతిలో కార్యక్రమాల ఒత్తిడిలో ఆయన ఉన్నందున సాధ్యం కాలేదు. తిరుమలకు వెళ్లేలోగా వివరించవచ్చని ఆయనతోపాటు కారులో ఎక్కి కూర్చున్నా. కాన్వాయ్ టోల్‌గేట్ దాటింది, మొదలుపెట్టబోతుండగా పెద్ద శబ్దం .. అంతే.. ఆ తర్వాత ఏమి జరిగిందో తెలియదు. నేను బతకడం కష్టమని వైద్యులు చెప్పేశారట. అయితే చంద్రబాబు ఢిల్లీ, బెంగళూరుల నుంచి నిపుణులైన వైద్యులను పిలిపించారు. హెలికాప్టర్ తెప్పించి హైదరాబాద్‌కు తరలించారు. సమయం పట్టినా కోలుకున్నా. అమ్మ నాకు తొలి జన్మనిస్తే, అలిపిరి ఘటన మలి జన్మనిచ్చింది. ఇది దేవుడిచ్చిన వరంగా భావిస్తుంటా.



- రెడ్డివారి రాజశేఖర్ రెడ్డి, అప్పటి పుత్తూరు ఎమ్మెల్యే

కారు 20 అడుగులు ఎగిరి పడింది



ఆరోజు సీఎం చంద్రబాబుతో పాటు ప్రయాణిస్తున్నా. హఠాత్తుగా కారు 20 అడుగులు పైకి ఎగిరి కిందపడింది. పెద్ద శబ్దం మాత్రమే వినిపించింది. ఆ తర్వాత స్పృహ వచ్చేసరికి ఆస్పత్రి బెడ్‌పై ఉన్నా. కోలుకున్న తర్వాత అలిపిరిలో జరిగిందేమిటో కథలు కథలుగా చెబుతుంటే, శ్రీవారి కరుణాకటాక్షాలతోనే బతికామని అనిపిస్తుంటుంది. ఎక్కడైతే ఘటన జరిగిందో, అక్కడే టోల్‌గేట్ నిర్మించారు. టీటీడీ ఛైర్మన్‌గా తిరుమలకు వెళ్తూ సంఘటన జరిగిన ప్రదేశాన్నే తదేకంగా చూస్తూ ఉండేవాడిని. వెంకటేశ్వరస్వామి ప్రసాదించిన మరో జన్మలో జీవిస్తున్నా.



- చదలవాడ కృష్ణమూర్తి, అప్పటి తిరుపతి ఎమ్మెల్యే

బ్లాస్ట్ .. సౌండ్.. దుమ్మూ...

సీఎం చంద్రబాబు స్విమ్స్ నుంచి తిరుమలకు బయలుదేరారు. లీడ్ కారులో డీఎస్పీ, నేనూ, మరో హెడ్ కానిస్టేబుల్ ఉన్నాం. టోల్‌గేట్ దాటుతుండగా వెనుక వస్తున్న వీఐపీ కారు మలుపు తిరిగిందా అని డీఎస్పీ చూడమన్నారు. నేను వెనక్కి తిరిగి చూస్తున్నా. పెద్ద బ్లాస్ట్ .. సౌండ్.. దుమ్మూ... బ్లాస్టింగ్ అని అర్థమైపోయింది. కారులోంచి దూకి వెనక్కి పరుగెత్తా. ఇంకా బాంబులుండచ్చు.. పేలచ్చు అని వారిస్తున్నా నేను వినలేదు. పొగలో ఎగిరి పడిపోయివున్న కారు వద్దకు చేరుకున్నా. ముందు సీటులో సీఎం పడిపోయి ఉన్నారు. వెనుక ముగ్గురు ఒకరిపై ఒకరు పడిపోయి ఉన్నారు. ముందుగా సీఎం గారిని కారులోనుంచి బయటకు తీశాం. అంబులెన్స్‌లో ఆస్పత్రికి తీసుకెళ్లాం. మరుసటి రోజు పేలని మరో 12 క్లెమోర్ మైన్స్ అక్కడ బయటపడ్డాయి. అవికూడా పేలివుంటే ఎవ్వరమూ మిగిలివుండేవాళ్లం కాదు. ఉద్యోగంలో చేరిన తొలి రోజుల్లో అటువంటి పరిస్థితిని ఎదుర్కొనే శక్తిని ఆ స్వామే నాకు ఇచ్చాడనిపిస్తుంది.





- అంజూ యాదవ్, పోలీసు అధికారి

ఆ దృశ్యం మిగిలిపోయింది



టీవీ జర్నలిస్టుగా కాన్వాయ్‌తో పాటూ కొండకు బయలుదేరా. వెనుక కారులోంచి ముందుకు సాగిపోతున్న కార్ల బారును కెమెరాలో ఫోకస్ చేశా. ఇంతలో ఢాం.. అంటూ భారీ విస్ఫోటనం..ముందున్న కార్లు చిల్లాపల్లాలుగా పడిపోయాయి. కార్లోంచి దూకి కెమెరాను ఫోకస్‌లోనే పట్టుకుని తెగి పడివున్న తీగలు దాటుకుంటూ ముందుకు పరుగు తీశా.నల్లటి పొగ కమ్ముకుని ఉంది. గాల్లోకి ఎగిరిన రాళ్ల ముక్కలు మీద పడుతున్నాయి. సీఎం కారు ఎక్కడా అని వెతుక్కుంటున్నా. ఆ దుమ్మూ పొగలోనే బోల్తాపడివున్న కారు చుట్టూ సీఎం సెక్యూరిటీ కోటలా చుట్టుకుని ఉన్నారు. పడమటి దిక్కున కొండల వెనుక సూర్యుడు అస్తమిస్తున్నాడు. ఎగిరి బోల్తాపడ్డ కారులోంచి చంద్రబాబును పైకి తీస్తున్నారు.. ఆ దృశ్యం నా కెమెరాలోనే కాదు నా గుండెల్లోనూ ఇప్పటికీ చెరగని ముద్రలా ఉండిపోయింది. మిగిలిన బాంబులు పేలివుంటే ఏమయ్యేది.. నేను చచ్చిపోయివుంటే మా అమ్మ ఏమైపోయేది.. అని ఆ తర్వాత తలుచుకుని వణికిపోయా.

- మునిరాజ, టీవీ జర్నలిస్టు

తొలి ఫొటో నాదే!



చంద్రబాబు కాన్వాయ్ కొండకు బయలుదేరింది.వెనుక సెక్యూరిటీ కారులో నేనున్నా. 'దర్శనం ఎన్నిగంటలకు' అని పక్కనే ఉన్న సెక్యూరిటీ వాళ్లను అడుగుతూ ఉన్నా. ఇంతలో భారీ పేలుడు శబ్దం వినిపించింది. దట్టంగా పొగ.. అరుపులు..కేకలు.. కారులోంచి అందరం బయటకు దూకి సీఎం కారువైపు పరుగులు తీశాం. రోడ్డు పక్కన కాలువలో కారు పడిపోయివుంది. అప్రయత్నంగా నా చేతులు కెమెరాను ఎయిమ్ చేశాయి. సెక్యూరిటీ, పోలీసు సిబ్బందీ దెబ్బతిన్న కారులోంచి చంద్రబాబును పైకి తీస్తూ ఉన్నారు. క్లిక్..క్లిక్.. క్లిక్ మంటూ నా వేళ్ల నొక్కుతూనే ఉన్నాయి. ఇప్పటిలాగా అప్పుడు డిజిటల్ కెమెరాలు లేవు. ఫిలిం కెమెరాలే. దుమ్ము, పొగలో ఫొటోలు ఎలా వస్తాయో కూడా తెలీదు. టెన్షన్.. టెన్షన్. చివరికి ఆ ఫొటోలే అలిపిరి సంఘటనకు ప్రధానం అయ్యాయి. సంఘటన జరిగిన వెంటనే తీసిన తొలి ఫొటో నాదే అయ్యింది.

- మాధవ్, అప్పటి సీఎం అధికారిక ఫొటోగ్రాఫర్

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చర్యలు: కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 1: జిల్లాలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. మంగళవారం సాయంత్రం రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రి సత్యప్రసాద్ మంగళగిరి సీసీఎల్‌ఏ కార్యాలయం నుంచి ఫ్రీహోల్డ్ చేసిన భూముల పరిశీలన, ప్రజలనుంచి వచ్చిన అర్జీల పరిష్కారం, సుమోటోగా క్యాస్ట్ వెరిఫికేషన్ అంశాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. చిత్తూరు నుంచి పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో భూసమస్యలు అధికశాతం కుటుంబసభ్యుల మధ్యే ఉన్నాయన్నారు. రీసర్వే, డీకేటీ పట్టాలు, ఆన్‌లైన్‌లో నమోదు కాకపోవడం వంటి కారణాలతో గ్రామీణ ప్రాంతాల్లో సమస్యలు ఉత్పన్నమౌతున్నాయన్నారు. మంత్రి మాట్లాడుతూ.. గ్రీవెన్స్ ఎప్పటికప్పుడు జీరో స్థాయికి తీసుకుని రావాలన్నారు. కలెక్టరేట్ నుంచి జేసీ విద్యాధరి, డీఆర్వో పుల్లయ్య, స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ గిరిబాబు పాల్గొన్నారు.

ఆయుధాలు వెనక్కిచ్చేలా ఆదేశించండి

- హైకోర్టును ఆశ్రయించిన పెద్దిరెడ్డి సోదరులు
- ప్రత్యర్థులపై వాటిని ప్రయోగించే అవకాశం
- అందుకే వెనక్కి ఇవ్వడం లేదు: పోలీసులు
- కౌంటర్ దాఖలు చేయాలని న్యాయమూర్తి ఆదేశం

అమరావతి, అక్టోబరు 1(ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న సమయంలో పోలీసులకు తాము అప్పగించిన లైసెన్స్ ఆయుధాలను తిరిగి ఇచ్చేలా ఆదేశించాలని కోరుతూ వైసీపీ ఎమ్మెల్యేలు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ద్వారకనాథ రెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. వీరు దాఖలు చేసిన పిటిషన్లను విచారణకు స్వీకరించిన కోర్టు.. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను ఆదేశించింది. విచారణను ఈ నెల 14కి వాయిదా వేస్తూ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. పోలీసుల తరఫున న్యాయవాది కేఎం కృష్ణారెడ్డి స్పందిస్తూ.. పిటిషనర్లు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రాంతాల్లో శాంతి భద్రతలు సునిశితంగా ఉన్నాయని, అధికార, ప్రతిపక్ష పార్టీల కార్యకర్తల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. ఈ కారణంగానే వారి ఆయుధాలు వెనక్కి ఇచ్చే విషయంలో పోలీసులు ఆచితూచి వ్యవహరిస్తున్నా రన్నారు. ప్రత్యర్థులపై ఆయుధాలు ప్రయోగిస్తారేమోనన్న ఆందోళన నెల కొందని తెలిపారు. దీనికి సంబంధించి పూర్తి వివరాలతో కౌంటర్ వేస్తామ న్నారు. పిటిషనర్ల తరఫున న్యాయవాది వీఆర్ఎన్ ప్రశాంత్ వాదనలు వినిపిస్తూ.. ఎన్నికల ప్రక్రియ ముగిసిన తర్వాత కూడా ఆయుధాలను అధి కారుల వద్దే ఉంచుకున్నారని, తిరిగి ఇవ్వాలని విన్నవించినా పట్టించుకోవడం లేదని తెలిపారు. పిటిషనర్ల ఆయుధాలు అన్నింటికీ లైసెన్సులు ఉన్నాయ న్నారు. లా అండ్ ఆర్డర్ పరంగా సున్నిత పరిస్థితులు ఉన్నాయని పోలీసులే చెబుతున్నారని, ప్రత్యర్థుల నుంచి ప్రాణహాని ఉన్న నేపథ్యంలో ఆయుధాలు వెనక్కి ఇచ్చేలా పోలీసులకు ఆదేశాలు ఇవ్వాలని అభ్యర్థించారు.

నెయ్యిలో కల్తీ వాస్తవమే.. కానీ జంతువుల కొవ్వు కాదు: చింతా

సూళ్లూరుపేట, అక్టోబరు 1: తిరుమల శ్రీవారి లడ్డూ తయారీకి వినియోగించే నెయ్యిలో కల్తీ వాస్తవమేనని, అయితే జంతువుల కొవ్వు కాదని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ అన్నారు. మంగళవారం సూళ్లూరుపేటలో ఆయన మీడియాతో మాట్లాడారు. లడ్డూ తయారీకి వినియోగించే నెయ్యిలో ఏమి కల్తీ చేశారో నిర్ధారించాక సీఎం చంద్రబాబు మాట్లాడి ఉండాల్సిందని, ఆయన తొందరపాటు వల్ల భక్తుల్లో అపోహలు కలిగాయన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో టీటీడీ పాలకవర్గం అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. కిలో ఆవు నెయ్యి రూ.700 పైచిలుకు ధర పలుకుతుంటే రూ.320కి ఎలా సరఫరా చేస్తారని ప్రశ్నించారు. కమీషన్లకు కక్కుర్తి పడి ఉన్న భవనాలను కూల్చి సత్రాల పేరుతో కొత్త నిర్మాణాలు చేపట్టారని విమర్శించారు.

నేడు, రేపు గ్రామసభలు

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 1: ప్రభుత్వ సూచనలతో బుధవారం గాంధీ జయంతి వేడుకలు అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామసభల ద్వారా నిర్వహించాలని ఈవోపీఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులను ఆదేశించినట్లు డీపీవో లక్ష్మి తెలిపారు. అలాగే గురువారం తప్పనిసరిగా ఉదయం తొమ్మిది నుంచి 11 గంటల మధ్య సర్పంచ్‌ల అధ్యక్షతన గ్రామసభలు నిర్వహించాలని పేర్కొన్నారు. గ్రామసభల్లో తొలివిడతగా 11 మేజర్ గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న క్లాప్‌మిత్రలకు సన్మానించి, పాదరక్షలు, నూనె సీసాలు, దుస్తులు పంపిణీ జరుగుతుందన్నారు. కార్యక్రమానికి స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని ఆదేశించినట్లు వివరించారు. ఇందుకయ్యే ఖర్చులను ఇటీవల విడుదల 15వ ఆర్థిక సంఘం నిధుల్లో అన్‌టైడ్ గ్రాంట్ నిధులను వినియోగించాలని సూచించారు.

రుయా డిప్యూటీ సీఎస్ఆర్ఎంవోగా శ్రీనివాస్

తిరుపతి(వైద్యం), అక్టోబరు 1: రుయాస్పత్రి డిప్యూటీ సీఎస్ఆర్ఎంవోగా డాక్టర్ శ్రీనివాసులను నియమిస్తూ డీఎంఈ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం రుయాస్పత్రిలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్‌ను ఇన్‌చార్జి సీఎస్ఆర్ఎంవోగా నియమిస్తూ సూపరింటెండెంట్ రవిప్రభు ఉత్తర్వులు జారీ చేశారు. కొంత కాలంగా రుయాస్పత్రిలో రెగ్యులర్ సీఎస్ఆర్ఎంవో పోస్టును భర్తీ చేయకపోవడం వలన ఇన్‌చార్జి సీఎస్ఆర్ఎంవోగా శ్రీనివాసులకు బాధ్యతలు అప్పగించారు.

అల్లర్ల కేసులో బాధితులకు ఆర్థికసాయం

- అమ్మాక్స్ సీఈవో రూ. 5.32 లక్షల చెక్కు అందజేత



బాధితులకు చెక్కును అందిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే, జడ్పీ చైర్మన్

వి.కోట, అక్టోబరు 1: వి.కోట అల్లర్ల ఘటన బాధితులకు రూ.5.32 లక్షల ఆర్థిక సాయాన్ని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, కలెక్టర్ సుమిత్ కుమార్ అందజేశారు. వి.కోట ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బాధితులతో కలెక్టర్ మాట్లాడారు. వారి ఇబ్బందులను తెలుసు కున్నారు. 54 మంది బాధితులకు వీకోటకు చెందిన అమ్మాక్స్ సీఈవో దశరథరెడ్డి తన వంతు సాయంగా ఈ మొత్తాన్ని సమ కూర్చారు. నష్టపరిహారం సరిపడకుంటే రెవెన్యూ అధికారులకు సమస్యలను తెలియజేయాలని ఎమ్మెల్యే కోరారు. స్థానికంగా అన్ని వర్గాల ప్రజలు కలసి మెలసి ఉంటున్నారన్నారు. అలాంటి వాతా వరణమే కొనసాగాలని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ఆకాంక్షించారు. శాంతి, భద్రతలకు విఘాతం కలిగితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని కలెక్టర్ హెచ్చరించారు. గతనెల 2న జరిగిన ఘటన బాధాకరమన్నారు. వినాయక చవితి, మిలాదున్ నబి పండుగలు మతసామరస్యంతో చేసుకోవడం ఇక్కడి ప్రజల సమైక్యభావనను తెలియజేస్తుందని జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు అన్నారు. తహసీల్దార్ పార్వతి, ఎంపీడీవో మహ్మద్ రఫీ, సీఐ సోమశేఖర్, ఏఎంసీ మాజీ ఛైర్మన్ రామచంద్రనాయుడు ఉన్నారు.

బోయకొండ హుండీ ఆదాయం రూ.51.57 లక్షలు



హుండీ లెక్కింపులో పాల్గొన్న బోయకొండ ఆలయ సిబ్బంది

చౌడేపల్లె, అక్టోబరు 1: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయానికి హుండీ ద్వారా రూ.51,57,968 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఏకాంబరం తెలిపారు. మంగళవారం గంగమ్మ ఆలయంలో దేవదాయ అధికారులు, మదనపల్లె దేవదాయ ఇన్‌స్పెక్టర్ ఎస్.శశికుమార్, చౌడేపల్లె పోలీసులు, ఐసీఐసీఐ బ్యాంకు సిబ్బంది, దిగువపల్లె, దేవాలయ సిబ్బంది పర్యవేక్షణలో హుండీ లెక్కించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ 57 రోజులకగానూ నగదు రూపంలో 51,57,968, బంగారం 61 గ్రాములు, వెండి 450 గ్రాములు, ఉజ్బెకిస్తాన్ 1000 సైమ్ మూడు నోట్లు, 500 సైమ్ రెండు నోట్లు, సింగపూర్ పది డాలర్ల నోటు వచ్చాయన్నారు. రణభేరి గంగమ్మ ఆలయంలో రూ.35,502 ఆదాయం వచ్చిందన్నారు.

వరసిద్ధుడి హుండీ ఆదాయం రూ.2.15 కోట్లు



ఈవో గురుప్రసాద్ పర్యవేక్షణలో స్వామి కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

ఐరాల(కాణిపాకం), అక్టోబరు 1: స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.2,15,30,322 లభించింది. స్వామి కానుకలను ఈవో గురుప్రసాద్ పర్యవేక్షణలో మంగళవారం ఆలయ సిబ్బంది లెక్కించారు. ఈ ఆదాయంలో 90 గ్రాముల బంగారు, 1.295 కిలోల వెండి లభించినట్లు ఈవో తెలియజేశారు. అలాగే గోసంరక్షణ హుండీ ద్వారా రూ.29,513, అన్నదాన సత్రం వద్ద ఏర్పాటు చేసిన హుండీ ద్వారా రూ.44,159, బ్రహ్మోత్సవాల్లో నిర్వహించిన బిక్షాండి ద్వారా రూ.18,212 సమకూరినట్లు తెలియజేశారు. అలాగే 947 యూఎస్ఏ, 10 ఆస్ట్రేలియా, 110 కెనడా డాలర్లు, 120 యూఏఈ దిర్హామ్స్, 55 ఇంగ్లాండు పౌండ్లు, 406 మలేసియా రింగిట్స్, 150 యూరోలు హుండీ ద్వారా లభించినట్లు వివరించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ ఈనెల 3వ తేదీ నుంచి కాణిపాకంలో ప్రారంభంకానున్న శరన్నవరాత్రులకు ఆలయ ఉభయదారులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. హుండీ లెక్కింపులో ఏఈవోలు రవీంద్రబాబు, ఎస్వీ కృష్ణారెడ్డి, హరిమాధవరెడ్డి, సూపరింటెండంట్లు కోదండపాణి, శ్రీధర్‌బాబు, బాలరంగస్వామి, సీఎఫ్‌వో నాగేశ్వరరావు, హుండీ ఇన్‌స్పెక్టర్ సుబ్రహ్మణ్యం నాయుడు, ఆలయ, యూనియన్ బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

పుంగనూరులో కిలో టమోటా రూ.46

పుంగనూరు రూరల్, అక్టోబరు 1: పుంగనూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం కిలో టమోటా ధర రూ.46 పలికింది. కొద్దిరోజులుగా ధరలు పెరుగుతుండటంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. మొదటి రకం కిలో రూ.46, రెండోరకం కిలో రూ.43, మూడో రకం కిలో ధర రూ.40 చొప్పున యార్డుకు వచ్చిన 16.65 మెట్రిక్ టన్నుల టమోటాను వ్యాపారులు కొనుగోలు చేశారు. డిమాండ్ ఉన్న ప్రాంతాలకు తరలించారు.

తూతూమంత్రంగా వృద్ధుల దినోత్సవం

వృద్ధుల ఆవేదన



వృద్ధుల దినోత్సవంలో ప్రసంగిస్తున్న కేశవులు

చిత్తూరు, అక్టోబరు 1: ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని తూతూమంత్రంగా జరిపించారని వృద్ధులు ఆవేదన వ్యక్తం చేశారు. ఏటా అక్టోబరు ఒకటో తేదీన ఈ కార్యక్రమం జరుగుతుంది. దీని నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం జిల్లాలో వృద్ధుల జనాభా ప్రకారం రూ.4లక్షల నుంచి రూ.6లక్షల వరకు విడుదల చేస్తుంది. ఈ కార్యక్రమానికి జిల్లాలోని వృద్ధులను పిలవాలి. వీరి ఇబ్బందులను తెలుసుకోవడానికి జిల్లా జడ్జితో పాటు డీఎల్ఎస్ఏ అధికారులు, ఎంపీ, ఎమ్మెల్యేలను ఆహ్వానిస్తారు. సమావేశంలో వృద్ధుల సమస్యలను తెలుసుకుని అధికారులు చర్యలకు ఆదేశాలిస్తారు. అయితే ఏడేళ్లుగా జిల్లా వయోవృద్ధుల సంక్షేమశాఖ అధికారులు మాత్రం ఈ దినోత్సవాన్ని తూతూమంత్రంగా కానిచ్చేసి, భోజనం, టీ, స్నాక్స్ కోసం విడుదల చేసే నిధులను కూడా స్వాహా చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

జరిపించారిలా..

మంగళవారం స్థానిక తపోవనంలో వృద్ధుల దినోత్సవాన్ని నిర్వహించారు. జిల్లాలో 2.68లక్షల మంది వృద్ధులు ఉన్నారు. వీరంతా రాకపోయినా చిత్తూరు నగరంలో ఉన్నవారిని ఆహ్వానించినా 500 మందికి తక్కువకాకుండా వచ్చేవారు. తపోవనంలో ఉన్న 20 మంది వృద్ధులతోనే ఈ కార్యక్రమాన్ని పూర్తిచేశారు. వీరికైనా భోజనం, టీ ఇచ్చారా అంటే అదీ లేదు. బెంగళూరుకు చెందిన ఓ దాత వితరణ చేసిన భోజనం, టీనే అధికారులు పెట్టినట్లు హంగామా చేసి వెళ్లిపోయారు. ఏడీ శ్రీనివాస్, వృద్ధులు శివకుమార్, కేశవులు తదితరులు హాజరై వృద్ధులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను అందజేస్తున్న సంక్షేమ పథకాలను తెలియజేశారు.

పంటలపై కొనసాగుతున్న గజదాడులు



తుడుంవారిపల్లి వద్ద ఏనుగుల దాడిలో ధ్వంసమైన వరిపంట

కల్లూరు, అక్టోబరు1: పులిచెర్ల మండలంలో పం టలపై ఏనుగులు దాడులు కొనసాగుతు న్నాయి. పాత పాళెంగుట్ట, ముచ్చు గుట్ట, పాతపేట, కల్లూరు, దేవళం పేట, బోడిరెడ్డి గారిపల్లి, వెంకటదాసరపల్లి తదితర పంచాయతీల్లో పంటలను ధ్వంసం చేస్తున్నాయి. వరి, మామిడి, వేరుశనగ, టమోటా, అరటి తదితర పంటలకు నష్టం వాటిల్లు తోంది. సోమవారం రాత్రి దేవళంపేట పంచాయతీ తుడుంవారిపల్లి సమీపానికి చేరుకున్న ఆరు ఏనుగులు పంటలను నాశనం చేశాయి. తుడుంవారిపల్లిలోని కౌలు రైతు రాజన్న అర ఏకరా వరి పంట, రైతు శ్రీనివాసులుకు చెందిన పశుగ్రాసాన్ని ధ్వంసం చేశాయి. అనంతరం గ్రామానికి వెనుక ఉన్న గుట్టలోకి ఏనుగుల గుంపు వెళ్లినట్లు స్థానికులు తెలిపారు. వీటి దాడులతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రేషన్ కార్డుదారులకు కందిపప్పు

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 1: రేషన్‌కార్డుదారులకు కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా నగదుకు కందిపప్పు సరఫరా మంగళవారం నుంచి ప్రారంభమైంది. ఏడాదిగా వైసీపీ ప్రభుత్వం కందిపప్పు పంపిణీకి మంగళం పాడిన విషయం తెలిసిందే. జిల్లాలోని కార్డుదారులకు 534 మెట్రిక్ టన్నుల కందిపప్పు పంపిణీ చేయనున్నారు. తొలి విడతగా మంగళవారం 30 టన్నుల కందిపప్పు రాగా.. వాటిని ఎండీయూ వాహనదారుల ద్వారా నగదుకు కిలో రూ.67కు పంపిణీ చేశారు. బహిరంగ మార్కెట్‌లో దాదాపు కిలో రూ.180 ఉండగా ప్రభుత్వం రెండుసార్లు ధరలను నియంత్రించి రూ.150కి అందించే ఏర్పాట్లు చేసింది.

పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం


నిమ్మనపల్లెలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్ బాషా


ములకలచెరువులో పింఛన్లు పంపిణీ చేస్తున్న జయచంద్రారెడ్డి


పీటీఎంలో పింఛన్ల పంపిణీని తనిఖీ చేస్తున్న ఎంపీడీవో

మదనపల్లె టౌన్, అక్టోబరు 1: రాష్ట్రంలో పేదల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్లతో వృద్ధులు, వికలాంగులు, వితం తువులు, కిడ్నీ, దీర్ఘకాలిక వ్యాధి గ్రస్థులకు ప్రభుత్వం అండగా నిలు స్తోందన్నారు. మంగళవారం మదనపల్లె మండలంలోని సీటీఎం, పోతబోలు, తట్టివారిపల్లె, పట్టణంలోని పలు ప్రాంతాల్లో పింఛన్లను ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ప్రతి నెలా ఒకటో తేదీనే లబ్ధిదారులకు సకాలంలో పింఛన్లు పంపిణీ చేసిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయ కులు, సచివాలయ సిబ్బంది, వీఆర్‌వోలు, పాల్గొన్నారు.

నిమ్మనపల్లిలో: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పేదల బతుకులు మారాయని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. మంగళవారం ఆయన రెడ్డివారిపల్లిలో వృద్ధులకు పింఛన్‌లను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాగానే ఇచ్చిన హామీలలో వృద్ధులకు ప్రతి నెలా రూ.4వేలు ఇవ్వడమే కాకుండా అన్నా క్యాంటీన్‌లను ప్రాభంభించినట్లు తెలిపారు. వృద్ధులు కుటుంబ సభ్యులపై అధార పడకుండా బతకాలని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామన్నారు. అలాగే కొండయ్యగారిపల్లి టీడీపీ నాయకులు మునిరత్నం, వెంకటరయణ వృద్ధులకు పింఛనలను పంపిణీ చేశారు. తహసీల్దార్ ధనంజేయులు, టీడీపీ నాయకులు ఆర్జే వెంకటేష్ రఫి, చెంద్రాయుడు, లక్ష్మన్న పాల్గొన్నారు.

ములకలచెరువులో: ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని సోంపల్లెలో మంగళవారం లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. అలాగే ఎన్టీఆర్ సృజన స్రవంతి పథకం కింద మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం పింఛన్లను పెంచి ప్రతి నెల లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పంపిణీ చేయిస్తున్నా రన్నారు. టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, జిల్లా కార్యదర్శి యర్రగుడి సురేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ ఛైర్మన్ కేవీ రమణ, నాయకులు ప్రసాద్‌రెడ్డి, రాము, వెంకట సిద్ధయ్య, రమణారెడ్డి, రఫీ, కుమార్, గురుమూర్తి, లక్ష్మీపతి, శంకర పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో: తంబళ్లపల్లె మండలంలో 6218 పింఛనుదారులు ఉండగా మంగళవారం సాయంత్రానికి 6150 మందికి 99 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో సురేంద్రనాథ్ తెలిపారు. సచివాలయ సిబ్బంది ఉదయం 5:30 గంటల నుంచే స్థానిక కూటమి నాయకులతో కలసి ఆయా గ్రామాల్లో ఇళ్ల వద్దకే వెళ్లి లబ్ధిదారులకు పింఛను పంపిణీ చేశారు. 1వ తేదీ పింఛను పొందలేని వారికి 2, 3 తేదీలలో పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

పెద్దతిప్పసముద్రంలో: పెద్దతిప్పసముద్రం మండలంలో మంగళవారంఎన్టీఆర్ భరోసా పెన్షన్లు 98.09 శాతం పంపిణీ చేసినట్లు ఎంపీడీవో కేఎస్ బాలాజీ తెలిపారు. పెద్దతిప్పసముద్రం మండలంలో మొత్తం 7949 పెన్షన్లు ఉండగా ఇందులో 7797 పెన్షన్లను మండల వ్యాప్తంగా పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో ఉదయం 6 గంటల నుంచి ఆయా గ్రామాల పరిధిలో సచివాలయ ఉద్యోగులు లబ్ధిదారులకు పెన్షన్లను పంపిణీ చేశారన్నారు.

వాల్మీకిపురంలో: వాల్మీకిపురం మండల వ్యాప్తంగా మంగళవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లు సచివాలయ ఉద్యోగులు, నాయకులు ఆధ్వర్యంలో ఉదయం 6గంటల నుంచి ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు అందజేశారు. మండలంలో మొత్తం 6844మంది లబ్ధిదారులకు పింఛను పంపిణీ కార్యక్రమం పూర్తి చేశామని ఎంపీడీవో మనోహరరాజు తెలిపారు. ఈకార్యక్రమాలలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

● కేజీబీవీ సెక్రటరీ మధుసూదన్ రావు


కేజీబీవీలో విద్యార్థుల నైపుణ్యాలను పరిశీలిస్తున్న సెక్రటరీ మధుసూదన్‌రావు

కురబలకోట, అక్టోబరు 1: విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల కేజీబీవీ సెక్రటరీ మధుసూదన్‌రావు తెలిపారు. మంగళవారం ముదివేడు కేజీబీవీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాలను వారిని అడిగి తెలుసుకున్నారు. వచ్చే ఏడాది పదో తరగతి ఫలితాల్లో జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు ద్వారకనాథ్, మనోహర, రెడ్డిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

టెట్‌ను పకడ్బందీగా నిర్వహిస్తాం

టెట్‌ను పకడ్బందీగా నిర్వహిస్తామని మధుసూదన్‌రావు తెలిపారు. మం గళవారం మండలంలోని అంగళ్లు సమీపంలోని టెట్ పరీక్షా కేంద్రాలు మిట్స్, విశ్వం కళాశాలలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 3వ తేదీ నుంచి 21 వరకు పరీక్షలను ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు. అభ్యర్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు చేపట్టామని తెలిపారు.

కేసులకు నిరసనగా నియోజకవర్గాల్లో బీఎస్పీ ఆందోళనలు


మాట్లాడుతున్న బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెల గౌతమ్‌కుమార్

మదనపల్లె అర్బన్, అక్టోబరు1: బీఎస్పీ నాయకులపై పెట్టిన కేసులకు నిరసనగా రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గంలో ఆ పార్టీ ఆధ్వర్యంలో నిరసనలు చేపట్టబో తున్నట్లు బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెల గౌతమ్‌కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక బీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగబద్ధంగా మా హక్కుల కోసం పోరాటాలు చేస్తుంటే పోలీ సులు మాపై కేసులు నమోదు చేయడం తగదన్నారు. దీనిపై జాతీయ ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేయడంతో పా టు హైకోర్టులో ఫిల్ వేస్తామన్నారు. కార్యక్రమంలో నేతలు, రమణ, బాలాజీ, గంగాధర్, శివ, ప్రశాంత్, ప్రసాద్, మహేష్, రెడ్డిప్ప, హరి పాల్గొన్నారు.

ములకలచెరువులో బీఎస్పీ నాయకుల నిరసన


నిరసన తెలియచేస్తున్న బీఎస్పీ నాయకులు

ములకలచెరువు, అక్టోబ రు 1: ములకలచెరువులో మంగళవారం బీఎస్పీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తంబళ్లపల్లె నియోజక వర్గ అధ్యక్షుడు సోమశేఖర్, ఇన్‌చార్జి మల్లికార్జున మాట్లాడుతూ అంబేడ్కర్ చిత్రపటాన్ని తొలగించిన ఎమ్మెల్యే రఘురామ కృష్ణమరాజు, దళిత డాక్టర్‌పై దాడి చేసి దూషించిన ఎమ్మెల్యే నానాజీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్య క్షుడు నరసింహులు, కో ఆర్డీనేటర్ టీవీ రమణ, నాయకులు కృష్ణప్ప, అంజి, నవీన్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముందస్తు దసరా ఉత్సవాలు

మదనపల్లె అర్బన్, అక్టోబరు1: స్థానిక సొసైటీ కాలనీలో విజయభారతీ హైస్కూల్‌లో మంగళవారం ముందస్తు దసరా ఉత్సవాల్లో భాగంగా రామాయణ ఇతిహాస నాటక ప్రదర్శనను విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పాల్గొన్నారు. విద్యార్థులు వినూత్నంగా రామాయణ గాథను ఆలరించారు. రావణాసురుడి ప్రతిమను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మాట్లాడుతూ పురాతన ఇతిహాసాలను తరువాత తరం వారికి గుర్తుఉండేలా, వారి జీవితాల్లో స్ఫూర్తి నింపేలా ప్రదర్శనలు చేసిన విజయభారతీ స్కూల్ కరస్పాండెంట్ సేతుకు అభినందనలు తెలిపారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీ కొన్న బోరు లారీ పోస్టుమ్యాన్ మృతి..అనాథలైన ఇద్దరు పిల్లలు


మృతుడు మధుకర్‌నాయుడు


విలపిస్తున్న చిన్న కుమారుడు సందీప్

తంబళ్లపల్లె, అక్టోబరు 1: ద్విచక్ర వాహనాన్ని బోరు లారీ ఢీ కొనడంతో మధుకర్‌నాయుడు(42) వ్యక్తి మృతి చెందిన విషాదకర సంఘటన తంబళ్లపల్లె మండల కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాల మేరకు..తంబళ్లపల్లె మండలం గంగిరెడ్డిపల్లెకు చెందిన మధుకర్‌నాయుడు(42) గోపిదిన్నె పోస్టుమ్యాన్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం సాయంత్రం తన విధులు ముగించుకుని ద్విచక్రవాహనంలో ఇంటికి బయలుదేరాడు. ఏటిగడ్డపల్లె సమీపంలో పరుసతోపు సచివాలయం వద్ద ఎదురుగా వస్తున్న బోరు లారీ ద్విచక్రవాహనాన్ని బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో మధుకర్‌నాయుడు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలిసిన వెంటనే హెడ్‌కానిస్టేబుళ్లు శంకర, గోపాల్ ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద తీరును పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె జిల్లా వైద్యశాలకు తరలించారు. పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తండ్రి మృతితో..అనాథలైన ఇద్దరు పిల్లలు

కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న మధుకర్‌నాయుడు మృతితో తన ఇద్దరు కుమారులు జశ్వంత్ నాయుడు, సందీప్ అనాథలయ్యారు. మధుకర్‌నాయుడు భార్య పద్మప్రియ ఏడాది క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో మధుకర్‌నాయుడు పోస్టుమ్యాన్‌గా పనిచేస్తూ..తన ఇద్దరి పిల్లల ఆలనాపాలనా చూసుకుంటూ చదివిస్తున్నాడు. పెద్దకుమారుడు జశ్వంత్ నాయుడు మదనపల్లె హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతుండగా, సందీప్ తంబళ్లపల్లె మోడల్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. ప్రమాదం జరిగిన స్థలానికి అతి సమీపంలోనే మోడల్ స్కూల్ ఉండటంతో పాఠశాల నుంచి వచ్చిన సందీప్ తండ్రి విగత జీవిగా పడి ఉండటాన్ని చూసి ఇక మాకు దిక్కెవరు నాన్న అంటూ...బోరున విలపించాడు. సందీప్, కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించడం అక్కడున్న ప్రతి ఒక్కరి మనసును కలిచివేసింది. ఈ రోదనలతో ప్రమాదం జరిగిన రహదారి పరిసరాల్లో కొద్దిసేపు విషాద వాతావరణం నెలకొంది. మధుకర్ నాయుడు మృతి చెందిన విషయం తెలియడంతో గంగిరెడ్డిపల్లెలో విషాదచాయలు అలముకున్నాయి. అనాథలైన ఇద్దరు పిల్లలను ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అడివిచెరువు రోడ్డు సమీపంలో ఉద్రిక్తత

● టీడీపీ మద్దతుదారులపై వైసీపీ నాయకుల దాడి

● తమపై హత్యాయత్నానికి యత్నించారని ఫిర్యాదు

ములకలచెరువు, అక్టోబరు 1: మండలంలోని సోంపల్లె పంచాయతీ అడివిచెరువు రోడ్డు సమీపంలో మంగళవారం సాయంత్రం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. టీడీపీ మద్దతుదారులపై వైసీపీ నాయకులు దాడికి పాల్పడ్డారు. తమపై హత్యాయత్నానికి పాల్పడిన వైసీపీ నాయకులపై చర్యలు తీసుకోవాలని మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమపై దాడి చేసి హత్యాయత్నంకు పాల్పడిన వారిపై పోలీసులు చర్యలు తీసుకోవడం లేదని టీడీపీ మద్దతుదారులు ఆరోపిస్తున్నారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు...ములకలచెరువు మండలానికి ఉపాధి హామీ పథకం కింద కేంద్ర ప్రభుత్వం 59 పనులు మంజూరు చేసింది. దీనికి గానూ రూ.1.87 కోట్లు విడుదలైంది. ఈ పనులకు ఇసుక సమకూర్చుకునేందుకు పీఆర్ ఉన్నతాధికారులు అనుమతులు ఇచ్చారు. దీంతో టీడీపీ మద్దతుదారులు ప్రభుత్వ పనులకు ఇసుక లభ్యత గుర్తించే పనిలో పడ్డారు. ఈక్రమంలో ఇసుక గుర్తించేందుకు వెళ్ళి వస్తున్న టీడీపీ మద్దతుదారులు చిట్రి కృష్ణ, శివప్రసాద్, రాజు, గణేష్‌పై వైసీపీ నాయకులు దాడి చేయడంతో గాయపడ్డారు. తమపై వైసీపీ నాయకులు మారణాయుధాలతో దాడి చేసి హత్యయత్నానికి ప్రయత్నించారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని టీడీపీ మద్దతుదారులు పేర్కొన్నారు. దీంతో కొంత సేపు అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలను పంపించివేశారు.

ఇసుక టిప్పర్లు సీజ్

వాల్మీకిపురం, అక్టోబరు 1: వాల్మీకిపురం మీదుగా ఇష్టారాజ్యంగా అర్ధరాత్రి టిప్పర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్న ఏపీ39టీఆర్0289, ఏపీ 39యుజె7969 నంబర్లు గల టిప్పర్లును సీజ్ చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. వాల్మీకిపురం నుంచి మదనపల్లె, తదితర ప్రాంతాలకు ఇసుక అక్రమ రవాణా చేస్తున్నట్లు సమాచారం అందడంతో స్థానిక ఎస్ఐ చంద్రశేఖర్ దాడి చేసి టిప్పర్లు సీజ్ చేయడంతో ఇసుక అక్రమ రవాణా వాహనాలను ఎక్కడికక్కడ దాచేయడం గమనార్హం.

నేడు ఉపాధి గ్రామ సభలు

కలికిరి, అక్టోబరు 1: ఉపాధి హామీ పథకానికి సంబంధించి బుధవారం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో గంగయ్య ఒక ప్రకటనలో తెలిపారు. దీంతోపాటు స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం ముగింపు వేడుకలు కూడా ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. ఉపాధి హామీ, సచివాలయాలు, వెలుగు సిబ్బంది నిర్ణీత షెడ్యూలు మేరకు గ్రామ సభల విజయవంతం చేయాలని కోరారు. గ్రామ సభలన్నీ సర్పంచుల అధ్యతన నిర్వహించాలన్నారు. అధికారులు అందరినీ సమన్వయం చేయవలసిందిగా గంగయ్య కోరారు.

శాంతియుతంతోనే భారతీయుల ఐక్యత


అశోక-అంబేడ్కర్ దమ్మయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె అర్బన్, అక్టోబరు1: శాంతి, సహోదరభావంతోనే భారతీయుల మధ్య ఐక్యత సాధించగమని ఎమ్మెల్యే షాజహాన్ బాషా తెలిపారు. దేశంలో శాంతి సమానత్వం కాంక్షిస్తూ బౌద్ధ భిక్షువుల అశోక-అంబేడ్కర్ దమ్మ యాత్రకు మదనపల్లెలో అపూర్వ స్వాగతం లభించింది. బుద్ధ సమాజ్ ఫౌండర్ ట్రస్టీ పీటీఎం శివప్రసాద్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అంబేడ్కర్ అనుయాయులు అంబేడ్కర్ సర్కిల్ వద్దకు చేరుకుని బౌద్ధ భిక్షువులకు, యాత్ర నిర్వాహకులను దుశ్శాలువతో సత్కరించారు. స్థానిక ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి ధమ్మయాత్రను ప్రారంభించారు. సమాజంలో కుల, మత, ద్వేషాలను, చెడు వ్యసనాలను, మూఢవిశ్వాసాలను దూరం చేసి మనుషులను ఉన్నతులుగా, శీలవంతులుగా మార్చగలవని చెప్పారు. సీటీఎం రోడ్డు నుంచి టౌన్‌బ్యాంకు సర్కిల్, అనిబిసెంట్ సర్కిల్ మీదుగా బెంగళూరు రోడ్డులోని కాలనీ గేట్ వద్ద నున్న అంబేద్కర్ సర్కిల్ వరకు కొనసాగింది. కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్రఅధ్యక్షుడు యమలా సుదర్శనం, ప్రజాకవి పోతబోలురెడ్డెప్ప, లక్ష్మీనారాయణ, గణపతి, రమణ, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తాం

పీలేరు, అక్టోబరు 1:రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరవచ్చేలా చూస్తామని ప్రముఖ ప్రకృతి వ్యవసాయ నిపుణుడు బోధిషావలి అన్నారు. మంగళవారం పీలేరులో రైతు ఉత్పత్తిదారుల సంఘంను ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సాగు చేసిన పంటలకు మంచి రేట్లు వచ్చేలా చేస్తామన్నారు. అనంతరం జిల్లా ఉద్యానవనశాఖ అధికారి రవిచంద్రబాబుకు వినతి పత్రం అందజేశారు.

మాలమహానాడు నూతన కార్యవర్గం ఎంపిక

వాల్మీకిపురం, అక్టోబరు 1:మాలమహానాడు నూతన కార్యవర్గాన్ని ఆ సంఘ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ యమల సుదర్శనం ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటస్వామి పేర్కొన్నారు. మాలమహానాడు పీలేరు నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా చింతపర్తికి చెందిన గడి చిరంజీవిని వాల్మీకిపురం మండల అధ్యక్షుడిగా జి.నాగార్జున, సెక్రటరీలుగా మనోజ్‌కుమార్, గౌతమ్, గౌరవాధ్యక్షుడిగా బీవీ రమణ, ఉపాధ్యక్షుడిగా కేవీ రమణ, కోశాధికారిగా శ్రీనివాసులు, యూత్ ప్రెసిడెంట్‌గా ప్రవీణ్‌కుమార్, తదితర సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా యమల సుదర్శనం, సీనియర్ సంఘ నాయకులు నూతన వర్గాన్ని అభినందించారు. అధ్యక్షుడు నాగార్జున మాట్లాడుతూ తనకు పదవి రావడానికి సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

ఎస్‌జీఎఫ్ జిల్లా హాకీ జట్లు ఎంపిక

మదనపల్లె టౌన్, అక్టోబరు 1: ఉమ్మడి చిత్తూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ హాకీ జట్లను ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వసంత ఆధ్వర్యంలో ఎంపిక చేశారు. మంగళవారం మండలంలోని సీటీఎం జడ్పీహైస్కూల్ మైదానంలో 250 క్రీడాకారులు ఎంపిక శిబిరానికి హాజరు కాగా వారిలో ప్రతిభ చూపిన బాల, బాలికలను రెండు జట్లుగా ఎంపిక చేశారు. ఈ జట్టుకు శిక్షణ ఇవ్వడంతో పాటు త్వరలో నెల్లూరు నిర్వహించే రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ హాకీ టోర్నమెంట్‌కు పంపనున్నామని సెక్రటరి వసంత తెలిపారు. ఈ పీడీలు నాగరాజ, నరేష్‌బాబు, రెడ్డిశ్రీనివాస్, పాండ్యన్, పార్థసారథి, జలజ, అరుణ, ప్రసన్న, భార్గవిలు పాల్గొన్నారు.

హాకీ జట్టుకు కన్నెమడుగు విద్యార్థిని ఎంపిక

తంబళ్లపల్లె, అక్టోబరు 1: ఉమ్మడి చిత్తూరు జిల్లా హాకీ జట్టుకు కన్నెమడుగు హైస్కూల్ విద్యార్థిని రోహిత ఎంపికైనట్లు పీడీ ఖాదర్‌బాషా తెలిపారు. మంగళవారం సీటీఎం ఉన్నత పాఠశాలలో అండర్-17 విభాగంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా హాకీ జట్టుకు బాలబాలికలకు ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో కన్నెమడుగు హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న ఆర్.రోహిత సత్తా చాటి ఉమ్మడి చిత్తూరు జిల్లా జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. జిల్లాకు ఎంపికైన విద్యార్థిని రోహితను ఎంఈవోలు త్యాగరాజు, నాగసుబ్బరాయుడు, హెచ్ఎం మదన్‌మోహన్, కమిటీ ఛైర్మన్ రెడ్డిశేఖర్, ఉపాధ్యాయులు అభినందించారు.

రేపటి నుంచి దసరా ఉత్సవాలు

గుర్రంకొండ, అక్టోబరు 1:గుర్రంకొండ మండలం చెర్లోపల్లె రెడ్డెమ్మకొండ ఆలయంలో గురువారం నుంచి అమ్మవారి దసరా మహోత్సవాలను నిర్వహించనున్నట్లు ఈవో మంజుల తెలిపారు. ఈ నెల 3 నుంచి 12 వరకు అమ్మవారి దసరా ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు.

నరసింహస్వామి పవిత్రోత్సవాలు

గుర్రంకొండ, అక్టోబరు 1:గుర్రంకొండ మండలం తరిగొండ లక్ష్మీనరసింహస్వామి వారి పవిత్రోత్సవాలను మూడు రోజుల పాటు టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఆలయాధికారి కృష్ణమూర్తి తెలిపారు. 2న అంకురార్పణ, 3న యాగశాల, స్నపనతిరుమంజనం, పవిత్ర ప్రతిష్ఠ, 4న పవిత్రాల సమర్పణ, 5న పవిత్ర వితరణ, తిరువీధి ఉత్సవం ఉంటుందన్నారు.

ఉపాధి కోల్పోయాం..ఆదుకోకుంటే ఆత్మహత్యలే శరణ్యం

● ఇసుక కొరత తీర్చాలని భవన నిర్మాణ కార్మికుల ధర్నా


ధర్నా చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

ములకలచెరువు, అక్టోబరు 1: ఇసుక కొరత కారణంగా భవన నిర్మాణ పనులు ఆగిపోయాయి... వందల కుటుంబాలు ఉపాధి కోల్పోయాం...పరిస్థితి ఇలాగే కొనసాగితే ఆత్మహత్యలే శరణ్యమని భవన నిర్మాణ, అనుబంధ రంగాల కార్మికులు వాపోయారు. ఇసుక కొరత తీర్చి తమకు పనుల దొరికేలా ఇక్కడే ఇసుక రీచ్‌ను ఏర్పాటు చేయాలని భవన నిర్మాణ కార్మికులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు శంకర్‌బాషా, బత్తుల రాజు మాట్లాడుతూ మండలంలో సుమారు 1200 మంది భవన నిర్మాణ, అనుబంధ కార్మికులు మేస్త్రీలు, కార్పెంటర్లు, పెయింటర్లు, ఎలక్ట్రీషియన్లు, ప్లంబింగ్, గ్రానైట్, టైల్స్ ఉన్నారన్నారు. దినసరి కూలీలు కావడంతో పని ఉంటే గానీ పూట గడవదన్నారు. మూడు నెలలుగా ఇసుక రవాణా పూర్తిగా నిలిచిపోవడంతో ఇళ్ల నిర్మాణాలు నిలిచిపోయాయని దీంతో పనులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఇసుక రీచ్‌ను 120 కిలో మీటర్ల దూరంలో ఉన్న రాజంపేటలో కేటాయించడంతో అక్కడి నుంచి ఇసుకను తెచ్చుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇసుక కొరతను తీర్చాలని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి, తహసీల్దార్ ప్రదీప్‌కుమార్‌కు వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కార్మికులు రెడ్డిప్రసాద్, నాయక, వెంకటేష్, రాకేష్, కుమార్, శ్రీనివాసులు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలు వెలికితీస్తే... ఆరోపణలు చేస్తారా..!

● వైసీపీ నాయకుడి అక్రమాలపై ధ్వజమెత్తిన కూటమి నాయకులు


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు

మదనపల్లె టౌన్, అక్టోబరు 1: మదనపల్లె మండలం సీటీఎం-2 గ్రామంలో వైసీపీ నాయకుల అక్రమాలను వెలికి తీస్తే...తమపైనే ఆరోపణలు చేయడం హేయమని కూటమి నాయకులతో పాటు సీటీఎం మాజీ సర్పంచ్ రెడ్డిరామ్‌ప్రసాద్ ధ్వజమెత్తారు. మంగళవారం మదనపల్లెలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో రెడ్డిరామ్‌ప్రసాద్ మాట్లాడుతూ సీటీఎం గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయానికి చెందిన 70 సెంట్ల భూమిని తమ బంధువులతో చేతులు కలిపిన వైసీపీ నాయకుడు అక్రమంగా రికార్డులు సృష్టించి, సబ్‌డివిజన్ చేయించి, వన్ బి పొందాడన్నారు. ఈ భూమిని విక్రయించేందుకు ప్రయత్నిస్తే ఈ భూమిని దేవుడికే చెందాలని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఆర్‌ఓఆర్ అప్పీల్ వేశామన్నారు. ఆర్‌వోఆర్ పెండింగ్‌లో ఉండగానే, వైసీపీ నాయకుడు ఎంపీ పీఏ అని చెప్పుకుంటూ రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తెచ్చి రికార్డులు తారుమారు చేశారన్నారు. మాజీ సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ నిరాధార ఆరోపణలు చేస్తూ కొందరు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. బీజేపీ నాయకుడు ఓసూరి కిరణ్ మాట్లాడుతూ సబ్‌కలెక్టరేట్ ఫైళ్ల దహనం కేసులో అనుమానితుడుగా పోలీసుల విచారణకు హాజరైన సీటీఎం-2గ్రామ వైసీపీ నాయకుడు వారి కుటుంబీకుల పేరుతో ఇళ్ల స్థలాలను మంజూరు చేయించుకున్నాడని విమర్శించారు. హౌసింగ్ పథకంలో 100 మంది అనర్హులకు ఇళ్ల స్థలాలను కేటాయించి వైసీపీ నాయకుడు విక్రయించడాని ఆరోపించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చల్లా నరసింహులు, శ్రీనివాసులు, వేమన్న, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేద్దాం.. ప్రాణదాతలు అవుదాం


వాల్మీకిపురం ప్రభుత్వాస్పత్రిలో రక్తదానం చేస్తున్న యువకులు

వాల్మీకిపురం, అక్టోబరు 1: సమాజంలో ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని వాల్మీకిపురం ప్రభుత్వాస్పత్రి సూపరిటెండెంట్ డాక్టర్ ఫైరోజాబేగం పేర్కొన్నారు. స్వచ్ఛతాహి సేవా కార్యక్ర మంలో భాగంగా ప్రపంచ రక్తదాన దినో త్సవం సందర్భంగా మంగళవారం రక్తదా న శిబిరం ఏర్పాటు చేశారు. ఆస్పత్రిలోని డాక్టర్లు, డిగ్రీ కళాశాల విద్యార్థులు, ఉద్యోగులు, యువత, మహిళలు స్వచ్ఛందంగా రక్తదా నం చేశారు. ఈప్రత్యేక శిబిరంలో 45మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కార్యక్ర మంలో డాక్టర్లు సోని, శివాని, హర్షితరెడ్డి, రవికుమార్, శ్రీలక్ష్మి, కిశోర్‌కుమార్, టీడీపీ మండల అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, నాయకులు గాంధీపేట రమణ, పీవీ నారాయణ, చంద్రమౌళి, రాజేంద్రాచారి, వల్లిగట్ల వెంకట రమణ, బొక్కసం బ్రదర్స్, యూసుఫ్, కలం ధర్, రామాంజులురెడ్డి, రమేష్‌బాబు, మదనపల్లె బ్లడ్ బ్యాంకు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సిబ్బంది, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

మదనపల్లెలో 38మంది రక్తదానం

మదనపల్లె అర్బన్, అక్టోబరు1: జాతీయ రక్తదాన దినోత్సవం సందర్భంగా మదనపల్లె పట్టణంలోని మెట్రో కాంప్లెక్స్ వద్ద నిర్వహించిన రక్తదాన శిబిరంలో 38మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా యువతకు స్ఫూర్తిగా హెల్పింగ్‌మైండ్స్ సేవలు నిలుస్తున్నాయని వన్‌టౌన్ సీఐ చంద్‌బాషా అన్నారు. హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకుడు అబూబక్కర్ సిద్దిక్ మాట్లాడుతూ సమాజసేవలో ఎక్కువగా రక్తదాన శిబిరాలు, క్యాన్సర్ వ్యాధి గ్రస్తులకు, నిరుపేదలకు సేవలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో వాలంటరీ బ్లడ్ బ్యాంకు బాలచంద్రనాయుడు, ల్యాబ్ టెక్నీషియన్ కృష్ణ, సభ్యులు హరికృష్ణ, కిరణ్, దినకర్, రమేష్, భాను, గుణ, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన రెవెన్యూ అధికారులు

వాల్మీకిపురం, అక్టోబరు 1: వాల్మీకిపురం రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం నూతన అధికారులు బాధ్యతలు చేపట్టారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా కురబలకోటలో పనిచేస్తున్న సుగుణ బదిలీపై వాల్మీకిపురంకు రాగా ఇక్కడ పనిచేస్తున్న శశికళ గుర్రంకొండ సీనియర్ అసిస్టెంట్‌గా బదిలీ అయ్యారు. అలాగే మదనపల్లె నుంచి పూర్ణచంద్ర వాల్మీకిపురం సర్వేయర్‌గా బాధ్యతలు చేపట్టగా ఇక్కడ పనిచేస్తున్న సర్వేయర్ శ్రీనివాసులు నాయక్ పుంగనూరుకు బదిలీ అయ్యారు.

కలికిరి మండలంలో వీఆర్వోల బదిలీలు

కలికిరి, అక్టోబరు 1: మండలంలో పనిచేస్తున్న 8 మంది గ్రేడ్-1, ఇరువురు గ్రేడ్-2 వీఆర్వోలు బదిలీ అయ్యారు. అదే విధంగా ఇరువురు గ్రేడ్-1, నలుగురు గ్రేడ్-2 వీఆర్వోలను మండలానికి బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. మండలం నుంచి గుట్టపాళెం వీఆర్వో కె.కదిరప్ప పీలేరు మండలం తలపులకు, కలికిరి నుంచి వి.విజ్ఞాన్ మదనపల్లె బసినికొండకు, కలికిరి-3 నుంచి ఆర్.విశ్వనాథంను వాల్మీకిపురం గండబోయనపల్లెకు, పత్తేగడ నుంచి ఎస్.సుధాకర్‌ను పీలేరు-1కు, గుండ్లూరు నుంచి టి.చంద్రయ్యను మదనపల్లె కొత్తపల్లె-1కు, మహల్ నుంచి కె.దొరస్వామిని గుర్రంకొండ-1కు, మర్రికుంటపల్లె నుంచి కె.కృష్ణప్పను నిమ్మనపల్లె బండ్లపైకు, కలికిరి-4 నుంచి ఎస్.తస్లీమాను గుండ్లూరుకు, అద్దవారిపల్లె వెంకటేశ్వర్‌ను పీలేరు ముడుపులవేములకు బదిలీ చేశారు. అదే విధంగా కేవీపల్లె ఎంపీపల్లె నుంచి డి.దశరథను మండలంలోని గుట్టపాలెంకు, మదనపల్లె చీకిలిబైలు నుంచి కె.రెడ్డిరాణిని కలికిరి-2కు, మదనపల్లె సొసైటీ కాలనీ నుంచి బి.గౌరిని కలికిరి-3కు, మదనపల్లె నెహ్రూబజారు నుంచి టి.భాగ్యలక్ష్మిని అద్దవారిపల్లెకు బదిలీ చేశారు. సెలవులో ఉన్న టి. ప్రసాద్ రెడ్డిని కలికిరి-1కు బదిలీ చేశారు.

కురబలకోటలో: కురబలకోట మండలంలో వీఆర్‌వోలను బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ చేమకూర్తి శ్రీధర్ ఉత్తర్వులు జారీ చేశారు. మండలంలోని అంగళ్ళు-1కి రామసముద్రం మండలం చంబకూరులో పని చేస్తున్న కె.శేఖర్, అంగళ్ళు-2 కు నిమ్మనపల్లె మండలం ముష్టూరులో పని చేస్తున్న బిశ్రీనివాసులు, కురబలకోట-1 కి పీటీఎం మండలం కాట్నగల్లుకు చెందిన సుశ్మిత, కురబలకోట-2కి నిమ్మనపల్లె మండలం అగ్రహారంలో పని చేస్తున్న తులసీనాథ్, ముదివేడుకు-1కి నిమ్మనపల్లె మండలం సంపకోటవారిపల్లెలో పని చేస్తున్న శరణ్‌కుమార్, ముదివేడుకు-2కి గుర్రంకొండ మండలం టి.పలసవాండ్లపల్లెకో పని చేస్తున్న పి.శ్రీనివాసులు, మట్లివారిపల్లెకు మదనపల్లె మండలం రామ్‌నగర్‌లో పని చేస్తున్న విశ్వనాథ్, తెట్టు-1కు అమ్మచెరువు మిట్టలో పని చేస్తున్న ప్రతా ప్, తెట్టు-2కు మాలేపల్లిలో పని చేస్తున్న రాణిసుజాతను, పిచ్చలవాండ్లపల్లెకు నిమ్మనపల్లె మండలం రెడ్డివారిపల్లెలో పని చేస్తు న్న నాగరాజ్‌ను నియమించారు.

'ఆహార దినోత్సవాన్ని ఆకలి రోజుగా జరుపుకోవాలి'

నిమ్మనపల్లి, అక్టోబరు 1: ప్రపంచ ఆహార దినోత్సవాన్ని పేదలు ఆకలి రోజుగా జరపుకోవాలని వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ రాష్ట్ర మహిళా కార్యదర్శి శోభ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పంచాయతి కొత్తపల్లిలో పేదలతో కలసి ప్రపంచ ఆహార దినోత్సవాన్ని ఆకలి రోజుగా జరుపుకోవాని పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 77ఏళ్ల కావస్తున్నా పేదల బతుకుల్లో వెలుతురు రాలేదన్నారు. కనీసం పేదలకు అందాల్సిన భూమి హక్కు, సాంఘిక భద్రతా హక్కు, కనీస వేతనాల హక్కు ఇలాఎన్నో హక్కులు అమలు కాలేదన్నారు. అక్టోబరు2 నుంచి 16 తేదీ వరకు కార్మికులందరూ ఏకమై ఆకలి దినంగా పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు.